

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 08.01.2026 | సంపుటి : 2 | సంచిక :333 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Thursday | 08.01.2026 | volume : 2 | Issue : 333 | Pages : 8 | Cost : 2/- |



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# ఫిబ్రవరిలో మున్సిపల్ ఎలక్షన్స్?

అధికారులను సన్నద్ధం చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్

కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

ఓటర్ల జాబితాల సవరణ, అభ్యంతరాలపై షెడ్యూల్

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశం

తెలంగాణలో ఇటీవలే గ్రామ పంచాయతీ ఎన్నికలు సమమర్ధంగా నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. తాజాగా మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) కసరత్తు చేస్తోంది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.




హైదరాబాద్, జనవరి 7 : ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలు, టైమ్‌లైన్స్‌పై కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. అందుకోసం బుధవారం జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉన్నతాధిరులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ꠰రాష్ట్ర వ్యాప్తంగా గతేడాది డిసెంబర్‌లో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవంతంగా నిర్వహించింది. తాజాగా.. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టింది. అందుకోసం జిల్లా, మున్సిపల్ ఉన్నతాధికారులతో ఎస్ఈసీ కీలక సమావేశం నిర్వహించింది. ఈ మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగుతాయని ఒక చర్చ సైతం సాగుతోంది. ఈ క్రమంలో తాజా ఆదేశాల మేరకు జనవరి 12లోగా ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని ఈ సందర్భంగా ఆయా అధికారులను ఎస్ఈసీ ఆదేశించింది. అలాగే జనవరి 13న టీ పోల్ -మిగతా 2 లో..



## సిఎం కప్ క్రీడల పోస్టర్ ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 7 : సీఎం కప్-2025 సెకండ్ ఎడిషన్ పోస్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ -మిగతా 2 లో..




## సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు

50శాతం అదనపు ఛార్జీలు: తెలంగాణ ఆర్టీసీ

హైదరాబాద్: సంక్రాంతి రద్దీ నేపథ్యంలో 6,431 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGS RTC) ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 9, 10, 12, 13, 18, 19 తేదీల్లో ప్రత్యేక బస్సులు -మిగతా 2 లో..



04

## ఎక్కడో కూర్చొని ఉచిత సలహాలు ఇస్తుంటారు

అవేవీ పట్టించుకోకుండా భారత్ భద్రతపై దృష్టి


విదేశాంగమంత్రి జైశంకర్ వ్యాఖ్య



03

## కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టం

మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి




03

## ఏప్రిల్ 1 నుంచి జనగణన తొలిదశ ప్రారంభం : కేంద్ర హోంశాఖ

# కేసీఆర్ అప్పులు చేసింది అభివృద్ధి కోసమే..

సిఎం రేవంత్ ఫ్రస్టేషన్‌లో ఉన్నాడు

కొత్త పల్లవి అందుకున్న బిఆర్ఎస్ నేత కేటీఆర్



02

తెలంగాణకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అద్భుతమైన ప్రాజెక్టులు తీసుకొచ్చారని కెటిఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ అప్ప చేసిన మాట వాస్తవమేనని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అయితే చేసిన అప్ప తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించారని వివరించారు. ఇందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. ఇకపోతే సీఎం రేవంత్ రెడ్డి తీవ్రమైన ఫ్రస్టేషన్‌లో ఉన్నారని కెటిఆర్ అన్నారు. ఆయనలో అంత ఫ్రస్టేషన్ ఎందుకో తనకు అర్థం కావడం లేదని తెలిపారు.



## తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు

03

ఏఐసీసీ పరిశీలకుడిగా ఉత్తమ్



04

## సుక్మా జిల్లాలో 26 మంది మావోయిస్టుల లొంగుబాటు



# అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్

సంక్రాంతి సందర్భంగా కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

ప్రపంచ పర్యాటకంగా తెలంగాణ అభివృద్ధి

అధికారులతో కలిసి సమీక్షించిన మంత్రి జూపల్లి

హైదరాబాద్, జనవరి 7 : ఈ సంక్రాంతి పండుగను సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణకు అనుగుణంగా ఘనంగా జరుపుతున్నామని తెలంగాణ పర్యాటక -మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 156 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 183 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 265 (కిలో) |
| స్కిన్ లెస్ | 302 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹82

## అన్ని వేళ్లూ ఒకేవైపు చూపిస్తున్నా చర్యలేవీ



డైలీ సీరియల్‌లా ఫోన్ ట్యాపింగ్ విచారణ

అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ పారిపోయింది

బిజెపి మాత్రమే సమర్ధ విపక్షంగా పనిచేసింది

మెదక్ ఎంపి రఘునందన్ రావు

మెదక్, జనవరి 7 : ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ డైలీ సీరియల్‌లా సాగుతోందని బీజేపీ సీనియర్ నేత, మెదక్ ఎంపీ -మిగతా 2 లో..


## ఐ బొమ్మ రవికి బెయిల్ తిరస్కరణ

ఐదు కేసుల్లో బెయిల్‌ను తిరస్కరించిన నాంపల్లి కోర్టు

పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. అతడి బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని రవి కోర్టును ఆశ్రయించాడు.



హైదరాబాద్,జనవరి 7:కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అతడికి విదేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ -మిగతా 2 లో..



## అమెరికాలో చట్టవిరుద్ధ పనులు చేయకండి

అది మీ వీసాపై ప్రభావం చూపుతుంది

భారతీయ విద్యార్థులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 7 : ఇండియాపై అమెరికా కక్ష కట్టినట్లే ఉంది. ఇటీవల అగ్రరాజ్యం వ్యవహరిస్తోన్న తీరు చూస్తుంటే అట్లే అనిపిస్తోంది. ఒకవైపు సుంకాల పేరుతో ఇండియాపై ట్రంప్ -మిగతా 2 లో..

# పుర పోరుకు కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

యాప్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఇక.. జనవరి 16న పోలింగ్ స్టేషన్ల వారీగా.. ఫొటోలతో కూడిన తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని సూచించింది. బ్యాలెట్ బాక్సులు, అవసరమైన సామగ్రి సిద్ధం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఎస్ఈసీ ఆదేశించింది. ఇక 2019 నాటి ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని స్పష్టం చేసింది. పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌వోల ద్వారా ఓటర్ల వివరాలను పరిశీలన చేయాలని సూచించింది. ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదు, మార్పులకు అవకాశమిచ్చిందని వివరించింది. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయాలని జారీచేసిన ఆదేశాల్లో ఎస్ఈసీ స్పష్టం చేసింది. జనవరి 12 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, 13 వరకు అభ్యంతరాల పరిశీలన ప్రారంభం, 16న ఓటరు జాబితా విడుదల చేయాలని ఆదేశం ఇచ్చారు. సమావేశంలో భాగంగా కలెక్టర్లకు ముఖ్యంగా ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాల ప్రచురణపై డెడ్‌లైన్లు నిర్దేశించారు. జనవరి 12వ తేదీ నాటికి తుది ఓటర్ల జాబితాను తప్పనిసరిగా ప్రచురించాలని ఈసీ ఆదేశించింది. 13వ తేదీ నాటికి పోలింగ్ స్టేషన్ల వివరాలతో కూడిన ముసాయిదా జాబితాను విడుదల చేసి, వెంటనే టీ పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇక, జనవరి 16వ తేదీ లోపు పోలింగ్ స్టేషన్ల పూర్తి వివరాలతో పాటు ఫొటోలతో కూడిన తుది జాబితా, తుది ఓటర్ల జాబితాను వార్డు పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ చర్య ద్వారా ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం, వివరాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని ఈసీ పేర్కొంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులపై కూడా ఈసీ కలెక్టర్లకు దిశానిర్దేశర చేసింది. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్/సర్వైలెన్స్ స్క్వాడ్స్ను నియమించి, ఎన్నికల పక్రియను పర్యవేక్షించాలని కమిషన్ సూచించింది. మరోవైపు, ఎన్నికల ఏర్పాట్లు పారదర్శకంగా, సమయపాలనతో జరిగితేనే ప్రజాస్వామ్య పక్రియ బలోపేతమవుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు. కలెక్టర్లు ఈ డెడ్‌లైన్లను కచ్చితంగా పాటిస్తూ, అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. అయితే, మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈసీ తీసుకున్న ఈ నిర్ణయాలు ఎన్నికల వేళ కీలకంగా మారనున్నాయి. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఎన్నికలు జరగాలనే లక్ష్యంతోనే ఈ ఆదేశాలు జారీ చేసినట్లు కమిషన్ వర్గాలు వెల్లడించాయి.

# అమెరికాలో చట్టవిరుద్ధ పనులు చేయకండి

(మొదటిపేజీ తరువాయి)

ఇష్టారీతిన టారిఫ్స్ విధిస్తుంటే.. మరోవైపు భారతీయ విద్యార్థులపై అమెరికా కఠిన ఆంక్షలు విధిస్తుంది. తాజాగా మరోసారి ఇండియన్ స్టూడెంట్స్‌కు అమెరికా వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికాలో చదువుతున్న భారతీయ విద్యార్థులు ఏదైనా ఉల్లంఘనలకు పాల్పడితే దేశ బహిష్కరణకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. అమెరికాలోకి ప్రవేశించడం ఒక హక్కు కాదని.. వీసా హోల్డర్లందరూ స్థానిక చట్టాలు, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని నొక్కి చెప్పింది. 'యుఎస్ చట్టాలను ఉల్లంఘించడం మీ స్టూడెంట్ వీసాపై తీవ్ర పరిణామాలు చూపించవచ్చు. రూల్స్ బ్రేక్ చేసి అరెస్ట్ అయినా, ఏదైనా చట్టాలను ఉల్లంఘించినా మీ వీసా రద్దు కావొచ్చు. దేశం నుంచి మిమ్మల్ని బహిష్కరించవచ్చు. అలాగే.. భవిష్యత్తులో యుఎస్ వీసాలకు మీరు అనర్హులుగా మారవచ్చు. నియమాలను పాటిస్తూ మీ ప్రయాణాన్ని ప్రమాదంలో పడేయకండి. యుఎస్ వీసా అనేది ఒక ప్రత్యేక హక్కు, పూర్తి హక్కు కాదు' అని యుఎస్ ఎంబసీ పేర్కొంది. అమెరికాలో ఉన్న సమయంలో విద్యార్థులు జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా ఉండాలని సూచించింది. ట్రంప్ రెండో అమెరికా పగ్గాలు చేపట్టాక కీలక మార్పులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో స్టూడెంట్ వీసా ఒకటి. స్టూడెంట్ వీసా ఫీజులను భారీగా పెంచడం, తప్పనిసరి సోషల్ మీడియా తనిఖీ వంటి కఠిన ఆంక్షలు విధించారు. ట్రంప్ పరిపాలన ఆంక్షలతో స్టూడెంట్స్ అమెరికా వెళ్లడం కష్టతరంగా మారింది.

## నిర్మాణ కూలీలు లక్ష్యంగా డ్రగ్స్ విక్రయం

### పక్కా సమాచారంతో పోలీసుల దాడి

**హైదరాబాద్, జనవరి 7:** కొంపల్లి పేట్‌బషీరాబాద్ వద్ద నిర్మాణ రంగం, ఇంటీరియర్ డిజైనింగ్ పనుల కోసం రాజస్థాన్ నుండి వలస వచ్చిన కళాకారులే లక్ష్యంగా సాగుతున్న భారీ మాదకద్రవ్యాల దందాను సైబరాబాద్ పోలీసులు గుట్టురట్టు చేశారు. పాన్ మసాలాల్లో మత్తు మందులు కలుపుకుని సేవించడమే కాకుండా, వాటిని అక్రమంగా విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును పేట్‌బషీరాబాద్ పోలీసులు మరియు ఈగల్ ఫోర్స్ ఛేదించింది. ÷రిలిలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్ మరియు ఇతర ఉత్తరాది రాష్ట్రాల నుండి జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చిన చాలా మంది కళాకారులు మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డారు. వీరు ఎండీఎంఏ, నల్లమందు క్షూతిబీప) వంటి ప్రమాదకరమైన మత్తు పదార్థాలను పాన్ మసాలాలలో కలుపుకుని సేవించడం పరిపాటిగా మారింది. సొంత ఊర్లకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు తమతో పాటు భారీ మొత్తంలో ఈ డ్రగ్స్‌ను తీసుకువచ్చి, తోటి రాజస్థానీ కార్మికులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ వ్యవహారం జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఈగల్ ఫోర్స్, స్థానిక పోలీసులను అప్రమత్తం చేసింది. గత ఒక నెల రోజులుగా నిఘా బృందాలు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షించాయి. ఈ సంయుక్త ఆపరేషన్‌లో కీలక నిందితుడు పట్టుబడ్డాడు. ÷ూజస్థాన్ నుండి డ్రగ్స్ తెచ్చి విక్రయిస్తున్న రాజేందర్ అరాజు భాకర్ (31) అనే ఇంటీరియర్ డిజైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుండి నల్లమందును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ మార్కెట్లో సుమారు రూ. 15 లక్షలు ఉంటుందని అంచనా.నిందితుడు రాజేందర్ 8వ తరగతి మధ్యలోనే మానేసి హైదరాబాద్ వచ్చి కార్పెంటర్, ఇంటీరియర్ డిజైనర్‌గా స్థిరపడ్డాడు. మత్తుకు బానిసైన ఇతను, ఇక్కడ డిమాండ్ పెరగడాన్ని గమనించి.. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాకు చెందిన సప్లయర్లు ధన్‌రాజ్, అనిల్, ముఖేష్‌ల నుంచి డ్రగ్స్ సేకరించి నగరానికి తెచ్చేవాడు. ఇక్కడ గ్రాముకు రూ. 5000 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ?ప్రస్తుతం ప్రధాన సప్లయర్లు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఈ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న పలువురు వినియోగదారులను కూడా పోలీసులు గుర్తించారు

## ఖమ్మం నగరపాలక సంస్థలో బీఆర్ఎస్‌కు మరో షాక్

### సిఎం సమక్షంలో కాంగ్రెస్‌లోకి మరో ముగ్గురు కార్పొరేటర్లు

**హైదరాబాద్, జనవరి 7 :** ఖమ్మం నగరపాలక సంస్థలో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఇటీవల ఆ పార్టీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరగా.. బుధవారం మరో ముగ్గురు చేరారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాజాగా కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లలో ధనియాల రాధ, తోట ఉమారాణి, రుద్రగాని శ్రీదేవి ఉన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఇటీవల బీఆర్ఎస్ నుంచి హస్తం పార్టీకి వచ్చిన కార్పొరేటర్లు సీహెచ్ లక్ష్మి, జి.చంద్రకళ, డి.సరస్వతి, అమృతమ్మ, ఎం.శ్రావణి సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సందర్భంగా
# కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

(మొదటిపేజీ తరువాయి)

శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 13 నుంచి 17 వరకు 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్' పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అదేవిధంగా మన దేశంలోని 15 రాష్ట్రాల కైట్ ఫ్లయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వీట్ స్టాల్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ షో కోసం ఏవియేషన్ అనుమతి ఇప్పటికే తీసుకున్నామన్నారు. ఈ బెలూన్ షో బుకింగ్ కోసం ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో పగలు గోల్ఫ్ కోర్స్, పరేడ్ గ్రౌండ్‌లో నైట్ డ్రోన్ షోలు కూడా ఉంటాయన్నారు. చెరువుల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ కార్యక్రమం జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పర్యాటకం అంటే కేవలం వినోదం కాదు, ఇది రాష్ట్ర ఆర్థిక రంగానికి చుక్కాని. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిస్తూ రెవెన్యూను, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తుంది. పర్యాటకం ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ రంగాలను ప్రభావితం చేస్తుంది. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు అవకాశమిస్తుంది. ప్రపంచాన్ని కొత్తగా చూడటం ఎలాగో నేర్పుతుంది. హోటళ్లు, రవాణా, రిటైల్ షాపులు దీనివల్ల భారీగా లబ్ధి పొందుతాయి. అంతేకాదు.'క్రాస్ కల్చరల్ ఇంటరాక్షన్'– అంటే వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు, నేపథ్యాలు ఉన్నవారి మధ్య బంధం బలపడేలా చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేసే రహదారులు, ఎయిర్‌పోర్టులు, తాగునీరు, పారిశుద్ధ్య సేవల అభివృద్ధి స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. నూతన పర్యాటక విధానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త సమతుల్య అభివృద్ధి కోసం 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను గుర్తించాం అని జూపల్లి అన్నారు. టూరిజం



కాంక్లేవ్, గ్లోబల్ సమ్మిట్ ద్వారా 22,324 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా సుమారు 90,000 ఉద్యోగాల కల్పనే మా లక్ష్యం అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో 19.44 మీటర్ల అతిపెద్ద బతుకమ్మ, 1,354 మంది మహిళలతో నృత్యం ద్వారా రెండు గిన్నిస్ రికార్డులు సాధించి తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశామన్నారు. మిస్ వరల్డ్ వేడుకలు, గ్లోబల్ సమ్మిట్‌ల నిర్వహణతో తెలంగాణ పెట్టుబడులకే కాదు, వ్యాపారానికి, పర్యటనకు అత్యంత 'సురక్షితమైన రాష్ట్రం' అని నిరూపించాం అన్నారు. మన పండుగలు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఈ సంక్రాంతికి 'అతిథి దేవోభవ' అనే ఆత్మీయ సంస్కారంతో ఆతిథ్య రంగం సిద్ధంగా ఉందన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ ఉత్సవంలో ఇండోనేషియా, ఆస్ట్రేలియా, కెనడా, శ్రీలంక, కంబోడియా, థాయిలాండ్, కొరియా, జపాన్, పోర్చుగల్, వియత్నాం, మలేషియా, ఇటలీ, స్విట్జర్లాండ్, అల్జీరియా, సింగపూర్, రష్యా, ఉక్రెయిన్ / ఫ్రాన్స్ వంటి 19 దేశాలకు చెందిన 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అలాగే భారతదేశంలోని 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ కైట్ ఫ్లయర్స్ పాల్గొంటారు. రాత్రి వేళ ఆకాశంలో వెలుగులు విరజిమ్మే 'నైట్ ఫ్లయింగ్'కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణ కానుందని అన్నారు. తెలంగాణ స్థానిక సంస్కృతిని ప్రోత్సహించేలా రాష్ట్ర సాంప్రదాయ కళా రూపాలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. వేదిక వద్ద సుమారు 100 చేనేత, హస్తకళల స్టాల్స్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల రుచులతో కూడిన 60 ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ సహకారంతో జరిగే ఈ ఉత్సవంలో ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి వచ్చి హైదరాబాద్ లో స్థిరపడిన వారు తమ ఇళ్లలో తయారు చేసిన 1,200 కంటే ఎక్కువ రకాల మిఠాయిలనుప్రదర్శిస్తారని అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జనవరి 16 నుండి 18 వరకు నిర్వహించ బడుతుందన్నారు. ఐరోపా దేశాలకు నుంచి వచ్చే ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయి 15 బెలూన్లతో ప్రదర్శన. ఉదయం పూట హైదరాబాద్ శివార్లలో, సాయంత్రం వేళ పరేడ్ గ్రౌండ్స్‌లో 'నైట్ గ్లో బెలూన్స్' ప్రదర్శన ఉంటుందన్నారు. జనవరి 16 / 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలోఅత్యాధునిక డ్రోన్లు, మల్టీ–కలర్ ఎఇడి లైట్లు, గగనతల విన్యాసాలతో ఈ షో సాగనుంది. ఇది భారతీయ సాంస్కృతిక వారసత్వం నుండి ఆధునిక ఆవిష్కరణల వరకు సాగిన ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది. హైదరాబాద్ – సోమశిల – శ్రీశైలం సర్క్యూట్‌లో పూర్తిస్థాయి హెలీ టూరిజం సేవలు అందుబాటులోకి వస్తాయి. నాగార్జున సాగర్, సోమశిల, బస్వాపూర్ ప్రాంతాలను ప్రపంచ స్థాయి వెడ్డింగ్ డెస్టినేషన్లుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా మార్చడానికి ప్రత్యేక సొసైటీ స్థాపన చేస్తున్నామని అన్నారు. పర్యాటకుల భద్రత కోసం 'టూరిస్ట్ పోలీస్' అందుబాటులోకి వస్తుందన్నారు. పర్యాటకం అంటే కేవలం సందర్శన కాదు, అది ఒక అనుభూతి. అది మనల్ని మూసధోరణుల నుంచి బయటపడేలా చేసి, మానసిక వికాసానికి, ఉత్సాహానికి దోహదపడుతుంది. వారసత్వ కట్టడాల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ మా ప్రభుత్వ బాధ్యత. మన పర్యాటకానికి యువత, టెక్కీలు, మీడియా, సెలబ్రిటీలు మరియు ఇన్‌ఫ్లుయెన్సర్లు రాయబారులుగా మారి... 'తెలంగాణ జరూర్ ఆనా' అంటే తెలంగాణకు తప్పక రండి అనే ఆత్మీయ పిలుపును ప్రపంచానికి చాటాలని కోరుతున్నట్లు వెల్లడించారు. పర్యాటకంపై అధికారులతో మంత్రి సమీక్షించి వివరాలు వెల్లడించారు.

# కేసీఆర్ అప్పులు చేసింది నిజమే

**ఖమ్మం, జనవరి 7 :** సెక్యూరిటీ వాళ్ళతో పాటు పోలీసుల్ని సైతం ఆయన కొడుతున్నారని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నాడని.. అరుస్తున్నాడు.. కొడుతున్నాడు.. రేపు ఎవరినైనా కరుస్తాడేమో జాగ్రత్త' అంటూ సీఎం భార్య గీతకు ఈ సందర్భంగా కేటీఆర్ హితవు పలికారు. అధికార కాంగ్రెస్ పార్టీలోని అగ్రనేతలకు, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలోని కీలక నేతల మధ్య మాటలు తూటాలు పేలుతున్న క్రమంలో కెటిఆర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ రెండు పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలతో మాటల వేడి బాగా పెరిగింది. తాజాగా బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బుధవారం హైదబారాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రైతుబంధు ఏమైందని ప్రశ్నిస్తే.. లాగులో తొండలు వదులుతాం అంటున్నారని మండిపడ్డారు. ఎప్పటికప్పుడు న్యూఢిల్లీ పోయి కప్పం కట్టి వస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో కప్పం కట్టకపోతే తన పదవి ఉండదని.. ఊడిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌కి తెలుసునన్నారు. తాను ఆంధ్రప్రదేశ్ వెళ్లి చదువుకుంటే తప్పు.. ఆయన మాత్రం ఆంధ్రాలోని భీమవరంకు చెందిన వ్యక్తిని అల్లుడిగా తెచ్చుకోవచ్చు నంటూ కేటీఆర్ వ్యంగ్యంగా పేర్కొన్నారు. తాను అమెరికాలో బాత్‌రూమ్‌లు కడుక్కుంటున్నానని అన్నారు. మరి అమెరికాలో మీ సోదరుడు జగదీష్ రెడ్డి కూడా ఉన్నాడని.. ఆయన తన ఇంట్లో ఆయనే కడుక్కోవట్లేదా? అంటూ సీఎం రేవంత్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ చురకలంటించారు. అమెరికాలో ఎవరింట్లో పనులు వాళ్ళే చేసుకుంటారని.. ఈ విషయం



తెలయకుంటే తెలుసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు. ప్రజలు.. మిమ్మల్ని గెలిపించింది ఈ పనికిమాలిన డైలాగుల కోసం కాదని.. పనిచేసి చూపించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు. యూరియా బస్తాల కోసం ప్రతి రోజు షాపుల ముందు రైతులు క్యూ కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాపుల్లో యూరియా లేనప్పుడు అందుకోసం రూపొందించిన యాప్‌లు ఏమి చేస్తాయంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. యూరియా అంశంలో యాప్‌ల సమస్య రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కొత్త డ్రామాకు తెరలేపిందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా మళ్ళీ కార్డులు తీసుకు వస్తామని ప్రభుత్వం చెబుతుందన్నారు.

# డైలీ సీరియల్‌లా
# ఫోన్ ట్యాపింగ్ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

ఎం.రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం మెదక్‌లో రఘునం దన్ రావు మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు డైలీ సీరియల్‌లా సాగుతోందని వ్యంగ్యంగా అన్నారు. కొండను తవ్వి ఎలుకను ఈ సిట్ పడుతుందో లేదో అంటూ సందేహం వ్యక్తం చేశారు. డేటాను సర్వీస్ ప్రొవైడర్ల వద్ద తీసుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. నేడు కొండల్ రెడ్డి, రేపు ఆయన డ్రైవర్ ఇలా ఎన్నాళ్లు అంటూ? సిట్ వ్యవహారశైలిపై ఆయన కొంత అసహనం వ్యక్తం చేశారు. కర్త, కర్మ అన్ని ఒకరివైపే వేలు చూపిస్తున్నాయని.. కానీ ఆయనను పిలిచేందుకు భయపడుతున్నారంటూ రఘునందన్ పరోక్షంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తతంగమంతా ఎన్నికల కోసం పిలుస్తున్నట్లుగా ఉందన్నారు. ÷ూఎ÷ు కాస్తా అఎ÷ు(కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ టీమ్)లా మారిందంటూ ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫస్ట్ బాధితుడిని తానేనని గుర్తు చేశారు. మొక్కుబడిగా ఐదు రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిం దంటూ రాష్ట్ర ప్రభుత్వంపై రఘునందన్ రావు మండిపడ్డారు. అసెంబ్లీని బాయ్‌కాట్ చేసి.. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పూర్తి వైఫల్యం చెందిందని విమర్శించారు. నీటి అంశాలపై చర్చకు పాలక పక్షం మీనమేషాలు లెక్కిస్తే.. బీఆర్ఎస్ పార్టీ భయపడి పారిపోయిందని పేర్కొన్నారు. తమ సంఖ్య తక్కువ ఉన్నా గట్టిగా పోరాడి.. పాలక పక్షాన్ని బీజేపీ నిలదీసిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపి శాసనసభా పక్ష నేత మహేశ్వర రెడ్డిని అభినందిస్తున్నానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తుంటే.. 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా సభలో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పాలమూరు జిల్లా మీద, కృష్ణా జలాల మీద కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఇదంటూ అధికార పార్టీ సభ్యులపై నిప్పులు చెరిగారు. కొంతమంది తమ పార్టీ నుంచి వలసపోతే కాంగ్రెస్ అధికారంలోకి



వచ్చిందన్నారు. ఆలోచించుకోవాలంటూ వలస నేతలకు ఈ సందర్భంగా ఆయన కీలక సూచన చేశారు. యెన్నెం శ్రీనివాస రెడ్డి కూడా తమ పార్టీ నుంచి వెళ్లిన వారేనని గుర్తు చేశారు. ఆలోచించుకోవాలంటూ ఆయనకు హితవు పలికారు. అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌లపై పోరాడేది.. ప్రజల పక్షాన ఉండేది బీజేపీ మాత్రమేనని ఎంపీ స్పష్టం చేశారు. తమ పార్టీలో కొత్త పాత అనేది ఏమిలేదని కుండబద్ధలు కొట్టారాయన. కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపిస్తే.. దేశంలో 6202వ పార్టీ అవుతుందన్నారు. ఎవరు కొత్త పార్టీ పెట్టిన తాము స్వాగతిస్తామని స్పష్టం చేశారు. ఒక నటుడు సినిమాకు టికెట్ల ధర పెంచి మరో నటుడికి పెంచకపోతే అది పక్షపాతం అవుతుందన్నారు. అందరికీ ఒకటే రూల్ ఉండాలి.. అన్ని సినిమాలకు ఒకటే రూల్ ఉండాలని రఘునందన్ తెలిపారు.

## సిఎం కప్ క్రీడల పోస్టర్ ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాసరాజు, సోనీబాల తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామస్థాయి, 28 నుంచి31 వరకు మండలస్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయి, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయి, ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయి. మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు.

## సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు

(మొదటిపేజీ తరువాయి)

నడుస్తాయని పేర్కొంది. ప్రత్యేక బస్సుల్లో 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్, ఆరాంఘర్, ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని చెప్పారు.



## ఐ బొమ్మ రవికి కోర్టులో చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తే దేశం దాటి వెళ్లిపోయే అవకాశం ఉందని తెలిపారు. విచారణ జరిపిన న్యాయస్థానం రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి ఇటీవల నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. ఈ బెయిల్ పిటిషన్లపై బుధవారం నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తాను హైదరాబాద్ వదిలి వెళ్లనని.. పోలీసు విచారణకు సహకరిస్తానని రవి కోర్టుకు తెలిపారు. ఇకపై పైరసీ చేయనని మొర పెట్టుకున్నాడు. మరోవైపు కేసు దర్యాప్తు దశలో ఉన్నదని పోలీసులు కోర్టుకు తెలిపారు. అలాగే ఇమ్మడి రవికిరవికి పలు దేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం ఐబొమ్మ రవి అభ్యర్థనను తోసిపుచ్చింది. ఐదు కేసుల్లోనూ బెయిల్ ఇచ్చేందుకు తిరస్కరించింది. ఆ బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

# ఖమ్మం జిల్లాకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు

- ముగ్గురు మంత్రులు ఉన్నా ఒరిగిందేమీ లేదు
- బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్



**ఖమ్మం, జనవరి 7 :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఇక్కడి ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడారు. నాడు ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడం కోసం కేసీఆర్‌గారు సీతారామసాగర్ ప్రాజెక్టును నిర్మించతలపెట్టి 90 శాతం పనులను పూర్తిచేశారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాలో 7.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, గోదావరి జలాలపై పూర్తి హక్కులు ఖమ్మం జిల్లాకే దక్కాలని నాడు కేసీఆర్ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కమీషన్‌లకు కక్కుర్తిపడి ప్రాజెక్టును పక్కనపెట్టారని మండిపడ్డారు. ఆ ముగ్గురు మంత్రులు ప్రజలకు మేలు చేయగల మొనగాళ్లు కాదని, మోసగాళ్లని కేటీఆర్ విమర్శించారు. వారు 30 శాతం చొప్పున కమీష న్‌లు వసూలు చేసి జేబులు నింపుకోవడమే తప్ప జిల్లాకు పనికొచ్చే పనులు ఒక్కటి కూడా చేయడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో ఈస్ట్‌మన్ కలర్‌లో సినిమా చూపెట్టారని, ఇదిస్తాం.. అదిస్తాం అని నోటికొచ్చిన హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఏదీ ఇవ్వలేదని విమర్శించారు. అశ్వారావుపేటలో ఒక్క సీతారామసాగర్ ప్రాజెక్టు ద్వారా 1.30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా కేసీఆర్ డిజైన్ చేశారని కేటీఆర్ చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు, ఇల్లందు నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు, కొత్తగూడెంలో 10 వేల ఎకరాలకు, వైరాలో 20 వేల ఎకరాలకు నీళ్లిచ్చేలా కేసీఆర్‌గారు సీతారామ ప్రాజెక్టును డిజైన్ చేశారు. కానీ ఆ ప్రాజెక్టును ప్రభుత్వం పక్కనపెట్టింది. ఈ రెండేళ్లలో ప్రభుత్వం చేసింది ఏమైనా ఉందంటే.. అది ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలేనని, కేటీఆర్ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపి నామా నాగేశ్వరరావు, పువ్వాడ అజయ్, రాజ్యసభ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని ఆదరించండి

### కేంద్రమంత్రి బండి సంజయ్ వినతి

**హైదరాబాద్, జనవరి 7 :** బిజెపితోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని, డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లనే రాష్ట్రం పురోగమనిస్తుందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. నరేంద్రమోడీ నాయకత్వంలో భారత్ ఉజ్వలంగా ఉందన్నారు. తెలంగాణలో కూడా భవిష్యత్ బాగుండాలని కోరుకుంటున్నామని అన్నారు. జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో భాజపాకు అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇటీవలి పంచాయితీ ఎన్నికల్లో పలుచోట్ల బిజెపి బలం చాటిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ బిజెపిని ఆశీర్వదించాలన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో నిర్మించనున్న సింథటిక్ ట్రాక్ స్థలాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ పరిశీలించారు. స్థల విషయమై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా జమ్మికుంట, హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.కోటి వ్యయంతో ఆధునిక పరికరాలను సమకూర్చానని చెప్పారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు చర్యలు తీసుకుంటామన్నారు. జమ్మికుంటలోని అంబేడ్కర్ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ ముంపు ప్రాంతాలను కాపాడతానని, వరదకాలువ నిర్మాణాన్ని చేపడతామన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం

### కేసు నమోదు చేసిన పోలీసులు

**విజయవాడ, జనవరి 7 :** జిల్లాలోని చందర్లపాడు మండలం విపరింతలపాడులో ఒక మైనర్ బాలికపై అత్యాచారం జరిగింది. ప్రేమ పేరుతో అదే గ్రామానికి చెందిన జాషువా(21) అనే యువకుడు బాలికను మోసం చేశాడు. 14 ఏళ్ల మైనర్ బాలిక.. పక్క గ్రామంలో ప్రభుత్వ వసతీ గృహంలో ఉంటూ జడ్పీహెచ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. క్రిస్మస్ పండుగ సందర్భంగా సెలవులకు స్వగ్రామానికి వచ్చింది. అదే గ్రామంలో ఉంటున్న జాషువా అనే యువకుడు బాలికను ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. డిసెంబర్ 26న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో చూసి అత్యాచారం చేశాడు. అనంతరం ఈ విషయం ఎవరికి చెప్పినా ఇద్దరు కలిసి దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తా అని బెదిరించాడు. బాలిక అనారోగ్యంగా ఉండటంతో ఆమె తల్లి ఏం జరిగిందని ప్రశ్నించగా అసలు విషయం చెప్పింది. తల్లిదండ్రులు గ్రామ పెద్దలను ఆశ్రయించగా అక్కడ రాజీ కుదరకపోవడంతో బుధవారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కేపీహెచ్‌బీ వెంకటేశ్వరాలయంలో చోరీ

### బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

**హైదరాబాద్, జనవరి 7 :** కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధి సర్దార్ పటేల్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భారీ చోరీ జరిగింది. మంగళవారం అర్ధరాత్రి ఆలయం లోకి చొరబడిన దొంగలు 15 తులాల వెండి, 3 తులాల బంగారు ఆభరణాలు.. వెండి, పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లారు. బుధవారం తెల్లవారుజామున రోజువారీ పూజల కోసం ఆలయాన్ని తెరిచిన పూజారులు చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. నిందితులు ఆలయంలోకి ప్రవేశించి చోరీ చేసిన దృశ్యాలు సీసీకెమెరాల్లో రికార్డయ్యా యి. ఫుటేజీని పరిశీలించిన పోలీసులు.. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఏప్రిల్ 1 నుంచి జనగణన తొలిదశ ప్రారంభం

### కేంద్ర హెూంశాఖ

**న్యూఢిల్లీ :** దేశంలో జనగణన (జవఅంబం 2027) తొలి విడతలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు గృహాల లిస్టింగ్ జరుగుతుందని కేంద్ర హెూంశాఖ వెల్లడించింది. ప్రతి రాష్ట్రానికి 30 రోజుల వ్యవధి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రక్రియ ప్రారంభానికి ముందు పదిహేను రోజుల పాటు స్వీయ గణనకు ఆప్షన్ కూడా ఉంటుందని తెలిపింది. పదేళ్లకోసారి దేశవ్యాప్తంగా నిర్వహించే జన గణన 2021లో చేపట్టాల్సి ఉండగా.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. తాజాగా దీనిని చేపట్టాలని నిర్ణయించిన కేంద్రం.. రెండు దశల్లో నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. తొలిదశలో గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్-సెప్టెంబరు), రెండో దశలో జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి- మార్చి 1)ను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ దఫా జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్రం ఇదివరకే స్పష్టం చేసింది. మొబైల్ యాప్‌ల ద్వారా జనాభా లెక్కల సమాచారాన్ని సేకరిస్తామని, స్వీయ గణనకు ఇదెంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంది. మరోవైపు, జనగణనతోపాటే కుల గణనను కూడా చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే.

## విషాదాంతం అయిన ప్రేమజంట జీవితం

- ఉరేసుకుని ప్రేమికురాలు బలవన్మరణం
- తట్టుకోలేక ప్రియుడు కూడా ఆత్మహత్య
- ఇరు కుటుంబాల్లో పెను విషాదం



**హైదరాబాద్, జనవరి 7 :** ప్రియురాలి మరణాన్ని తట్టుకోలేక ప్రియుడు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో పూజ అనే 17 ఏళ్ల యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తమ బిడ్డ ఆత్మహత్యకు కారణం అదే గ్రామానికి చెందిన సిద్దగోని మహేష్ అని మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం మహేష్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణపల్లె సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని.. నిప్పంటించుకుని తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో కూడా వీరిద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడి కోలుకున్నారు. గత కొంతకాలంగా మహేష్, పూజ ప్రేమించుకున్నట్లు సమాచారం. ఇలా ప్రేమ కారణంగా అనేక మంది యువతీ యువకులు క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్నారు. కొందరు హత్య చేస్తుండగా.. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రేమలో మోసపోయామని కొందరు, పెద్దలు ఒప్పుకోలేదని మరికొందరు ఇలా తమ నూరేళ్ల జీవితాన్ని అర్ధాంతరంగా ముగిస్తున్నారు. :వారిద్దరు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. జీవితాంతం కలిసి జీవించాలని కలలు కన్నారు. అందుకు పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో ఒకరు లేకుండా మరొకరు ఉండలేక చావే శరణ్యమని భావించారు. ఉరేసుకొని ప్రియురాలు పెట్రోల్ పోసుకొని నేడు ప్రియుడు ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. క్షణికావేశంతో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. దీంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. రంగారెడ్డ జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో పోతురాజు అలివేలు కూతురు పోతురాజు పూజ (16)అనే విద్యార్థిని ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. పూజా తండ్రి పదహారేళ్ల క్రితం మృతి చెందడంతో అప్పటినుంచి తన తల్లి అలివేలు కుమారుడు కుమార్తె ఇరువురిని పెంచి పోషించింది. అదే గ్రామానికి చెందిన సిద్ధగోని యాదయ్య కుమారుడు సిద్ధగోని మహేష్ (20) గత నాలుగు ఐదు నెలలుగా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. విషయం ఇరు కుటుంబాల్లో తెలవడంతో వీరిని గత కొన్ని రోజులుగా కలుసుకోకుండా చేశారు. దీంతో ఇటీవలే మహేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కొన్ని రోజులు దవాఖానాలో చికిత్స పొంది ప్రాణాలతో బయటపడ్డాడు. మహేష్ పురుగుల మందు తాగిన విషయాన్ని తెలుసుకున్న పూజ సైతం మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించింది. ఆమె సైతం ప్రాణాలతో బయటపడింది. పెళ్లి చేసుకోకుం టే చస్తానని మహేష్ ఫోన్ చేసి చెప్పడంతో.. పూజ మానసిక ఒత్తిడికి గురైంది. తన ప్రియుడు ఆత్మహత్య చేసుకుంటాడేమోనని దిగులుతో తానే మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం ఎనిమిది గంటలకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పూజ మృతి చెందడంతో గ్రామంలో కొద్దిసేపు ఆందోళన నెలకొంది. పోలీసుల రంగప్రవేశంతో పూజ మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. సాయంత్రం మృతదేహాన్ని తీసుకొచ్చి పూడ్చిపెట్టారు. పూజ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న మహేష్ బుధవారం హయత్ నగర్ పరిధిలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అటు పూజ ఇటు మహేష్ ఆత్మహత్య చేసుకుని చనిపోవడంతో మేడిపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇరు కుటుంబాలలో రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.



## కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టం

### మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్:** కవిత వచ్చి విజ్ఞప్తి చేయడంతోనే ఆమె రాజీనామాను ఆమోదించినట్లు తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. భావోద్వేగంతో రాజీనామా చేసినప్పుడు కొంతకాలం వేచిచూస్తామని.. ఆమె విషయంలోనూ అదే జరిగిందన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ప్రకటనపైనా గుత్తా స్పందించారు. "రాష్ట్రంలో కొత్తగా పార్టీలు పెట్టాల్సినంత అవసరం లేదు. కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టం. గతంలో వచ్చిన పలు రాజకీయ పార్టీలు కనుమరుగయ్యాయి. ఏ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడతారనే దానిపై స్పష్టత లేదు. జనాభా ప్రాతిపదికన జరిగిన దక్షణాది రాష్ట్రాలకు నష్టం. హిల్ట్ విధానం ద్వారా ఎలాంటి అవినీతి జరగదు. కాలుష్యం కట్టడికి పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం సరికాదు" అని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

## ఏసీబీ వలలో చిక్కిన అవినీతి చేపలు

**రంగారెడ్డి :** తెలంగాణలోని వివిధ చోట్ల పలువురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఎంపీడీవో కార్యాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా నందిగామ ఎంపీడీవో సుమతి, ఏపీవో తేజ్ సింగ్, ఈదులపల్లి కార్యదర్శి చెన్నయ్యను ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ అరెస్ట్ చేశారు. నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో బొబ్బిలి ప్రవీణ్ చేపట్టిన భవన నిర్మాణానికి రూ.3.5లక్షలు లంచం ఇవ్వాలని అధికారులు డిమాండ్ చేశారు. గతంలో రూ.లక్ష ఇచ్చిన ప్రవీణ్.. ఈ వ్యవహారంపై ఏసీబీ అధికారులకు సమాచారం అందించారు. బుధవారం మరో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ముగ్గురినీ ఏసీబీ డీఎస్పీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు

### ఏఐసీసీ పరిశీలకుడిగా ఉత్తమ్



**హైదరాబాద్:** తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియమితుల య్యారు. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షణకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులను నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అస్సాం ఎన్నికల పరిశీలకులుగా భూపేష్ భగేల్, డీకే శివకుమార్, బంధు టిర్కి, కేరళకు సచిన్ పైలెట్, కేజె జార్జ్, ఇమ్రాన్, కన్హయ్య కుమార్, తమిళనాడు, పుదుచ్చేరికి పరిశీలకులుగా ముఖుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజి మహ్మద్ నిజాముద్దీన్.. పశ్చిమ బెంగాల్‌కు సుదీప్ రాయ్ భర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాష్ జోషిని నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శ కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

## కేరళలో అయ్యప్పల కారుకు ప్రమాదం

### ప్రమాదంలో హైదరాబాద్ వాసి దుర్మరణం

**హైదరాబాద్, జనవరి 7 :** శబరిమల యాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న భక్తుల వాహనం కేరళలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ఉద్యోగి అశోక్ మృతి చెందారు, మరో ముగ్గురు కుటుంబ సభ్యులు గాయపడ్డారు. ప్రమాదం బుధవారం ఉదయం 5:30 గంటలకు మువత్తుపుళ్ పెరుంబవూర్ రోడ్డులోని త్రిక్కలత్తూర్, కవుంపాడు వద్ద జరిగింది. భక్తులు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు, ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడ్డవారిలో కొడుకు, అల్లుడు తీవ్రంగా గాయపడ్డారు. అల్లుడు ఆరోగ్యం అత్యంత విషమంగా ఉంది. గాయపడినవారిని స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు.. సమాచారం అందుకున్న వెంటనే మువత్తుపుళ్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అదే ప్రాంతంలో నెల క్రితం అయ్యప్ప భక్తుల బస్సు మరియు లారీ ఢీకొన్న ఘటన జరిగింది. ఆ సమయంలో ఎవరికి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంపై తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

## గిరిజన సంక్షేమానికి కృషి

- ఎప్పుడూ లేనంతగా నిధుల కేటాయింపు
- రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన సీతక్క



**ములుగు, జనవరి 7 :** గిరిజనల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, గతంలో ఎప్పుడూ లేని విధంగా రేవంత్ నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పాటుపడుతోందని మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిం చారు. క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, స్థానిక డీడీ దబ్బకట్ల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఆదివాసీల ఆత్మగౌరవం, అస్తిత్వానికి ప్రతీకగా మేడారం జాతర రూపుదిద్దుకుంటుందని, జాతర పవిత్రతను కాపాడాలని మంత్రి సీతక్క సూచించారు. పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకుల సమన్వయంతో జాతర విజయవంతం చేయాలన్నారు. జాతర నిర్వహణపై ఆదివాసీ సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలపాలని సూచించారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసం మేడారం జాతర కలకలాం గుర్తుండిపోయేలా ఆలయ ప్రాంగణం రూపుదిద్దుకుంటుందని వెల్లడించారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకొచ్చేటప్పుడు ఆదివాసీ యువజన సంఘాలు సమన్వయం పాటించాలని, వలంటరీ సభ్యులకు, మహిళలకు ప్రత్యేకంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. జాతర సమయంలో ఇసుక లారీల రవాణాను పూర్తిగా నిలిపివేయనున్నట్లు వివరించారు. జాతరకు వచ్చే భక్తులు ఏ విధంగా దర్శనం చేసుకోవాలనే అంశంపై ప్రత్యే క రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించామని అన్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా జాతరకు ఏర్పాట్లు చేస్తున్నామని, అభివృద్ధిక శ్రీకారం చుట్టామని అన్నారు.

## 'గ్రోక్' అసభ్య కంటెంట్ వ్యవహారం

### కేంద్ర్రానికి 'ఎక్స్' నివేదిక

**న్యూఢిల్లీ :** సోషల్ మీడియా వేదికలో అసభ్యకరమైన, అశ్లీల కంటెంట్‌ను తొలగించాలని 'ఎక్స్'కు కేంద్రం ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన గడువు బుధవారం సాయంత్రంతో ముగిసింది. ఈలోగా కేంద్ర ప్రభుత్వానికి 'ఎక్ష తన నివేదికను అందజేసినట్లు తెలిసింది. దానిని ఐటీ శాఖ పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. ఎక్స్‌లో అసభ్యకర కంటెంట్‌కు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై ఆయా సామాజిక మాధ్యమ వేదికలదే బాధ్యత అని కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్పష్టం చేసింది. స్థానిక ఐటీ చట్టాలను ఉల్లంఘిస్తూ రూపొందించిన, వ్యాప్తి చేసిన కంటెంట్ మొత్తాన్ని తక్షణమే తొలగించాలని పేర్కొంటూ జనవరి 2న ఎక్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. అభ్యంతరకర కంటెంట్, యూజర్లు, అకౌంట్లపైనా చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలకు సంబంధించి 72 గంటల్లోగా నివేదికను అందజేయాలని స్పష్టం చేసింది. దీనిపై 'ఎక్స్' ఇటీవల స్పందిస్తూ.. చట్టవిరుద్ధ కంటెంట్ రూపొందించేందుకు గ్రోక్‌ను ఉపయోగించే వారు తదుపరి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

## వరంగల్ చౌరస్తాలో వివాహిత హల్‌చల్

### భర్తపై కత్తితో దాడికి యత్నం

**వరంగల్, జనవరి 7 :** వరంగల్ చౌరస్తాలో ఓ వివాహిత కత్తి పట్టుకుని హల్‌చల్ చేసింది. భర్త వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని కత్తితో దాడికి యత్నించింది. భార్య నుండి తప్పించుకునేందుకు భర్త జ్యువలరీ షాపులోదాక్కున్నాడు. వెంటనే డయల్100 కి ఫోన్ చేశాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి మహిళ చేతిలోని కత్తిని పోలీసులు లాక్కున్నారు. తనకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగింది వివాహిత జ్యోత్స్న. తన భర్త శ్రీకాంత్ అక్రమ సంబంధం పెట్టుకొని తనకు విడాకులు ఇస్తున్నాడని ఆరోపించింది. తనకు ఉండడానికి చోటు లేకుండా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఆస్తిని, పిల్లలను తనకు కాకుండా చేస్తున్నాడని మండిపడింది. కాగా విడాకుల కోసం భర్త శ్రీకాంత్ కోర్టు మెట్లు ఎక్కినట్లు తెలిపింది. పోలీసులు వివాహితకు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రపంచ మనుగడకు సవాల్‌గా ట్రంప్!



**అమెరికా ఇతర దేశాల మీద దాడిచేస్తే.. కారణాలు ఉంటాయి. కానీ ఇతర దేశాలు దాడి చేస్తే అది తప్పంటాడు. ఎవరి కారణాలు వారికి ఉంటాయి. అయితే ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయ్యాక టెంపరితనం పెరిగింది. ప్రపంచంలో పెద్దన్న పాత్ర పోషించాలని చూస్తున్నారు. సామ్రాజ్యవాద విస్తరణ కాంక్ష కనిపిస్తోంది. తన కనుసన్నల్లో అన్ని దేశాలు నడవాలన్న నిరంకుశ రాజరికం కనిపిస్తోంది. ఏ దేశం కూడా తన కనుసన్నల్లోనే నడవాలను హుంకరిస్తున్నారు. పన్నుల టారిఫ్‌లతో విరుచుకు పడుతున్నారు. మొత్తంగా రెండురకాలుగా ట్రంప్ ప్రపంచాన్ని గిప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నారు. చెప్పినట్లు వింటే టారిఫ్‌ల బాదుడు ఉండదు. చెప్పినట్లు వినకుంటే టారిఫ్‌లు విధిస్తున్నారు. ఈ క్రమంలో చైనా,భారత్ వంటి దేశాలపై పన్నులతో విరుచుకు పడుతున్నారు. ఇలా కాని పక్షంలో బడిత ఉన్నోడిదే బర్రె అనే సామెతలో వెనిజువెలా లాంటి దేశాలపై సైనిక దాడికి దిగుతున్నాడు.**

ఇప్పటికే ఇరాన్, ఖతార్, సిరియాలపై విరుచుకుపడి బాంబులు వేశారు. వెనెజువెలాను తామే పాలిస్తామని చెప్పడం ఏరకమైన న్యాయం అన్నది అర్థం కాదు. ప్రపంచంలో సైనిక పాటవశక్తి ఉంటే ఏ దేశం మీదయినా దాడి చేయవచ్చా అన్న సందేహాలు వస్తున్నాయి. అలా అయితే మన దేశం నుంచి విడిపోయిన పాక్, బంగ్లా దేశ్‌లపై మనం కూడా దాడి చేసి భారత్‌లో కలిపేసుకుని, అఖండ భారత్ కలను సాకారం చేసుకోవచ్చు. అందుకు కొన్నిదేశాల మద్దతు అంటే, అమెరికాను ఎదిరించే దేశాల మద్దతు కూడగడితే చాలన్నమాట. భారత్‌లో ఉగ్రవాదులను ఉసిగొల్పుతున్న పాక్‌కు బుద్ధి చెప్పేందుకు దాడి చేస్తే అడ్డుకోవాలని ట్రంప్ చూశారు. తానే పాక్, భారత్ యుద్ధాన్ని ఆపానని అంటాడు. ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధం వద్దని పెత్తనం చెలాయిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేయవద్దని అంటాడు. ఇలా ట్రంప్ తన తలకెక్కిన అహంకారంతో వ్యవహరి స్తున్నాడు. నిజానికి ఇప్పుడు భారత్ బంగ్లాదేశ్‌పై దాడి చేయాలి. అక్కడ మైనార్టీ హిందువులను ఊచకోత కోస్తున్నందుకు కలగచేసుకోవాలి. కానీ ఇది అంతర్జాతీయ సమస్య అవుతుంది. అదే అమెరికా వెనెజువెలాపై దాడిచేసి, ఆ దేశ అధ్యక్షుడిని పట్టుకుని వెళితే ఏ దేశం కూడా అడ్డుకోలేక పోయింది. దీంతో లాటిన్ అమెరికాలోని వెనిజులా ప్రస్తుతం ఒక విచిత్ర పరిస్థితిలో ఉంది. జనవరి మూడవ తేదీన రాజధాని కారకాస్ పై దాడి చేసిన అమెరికా నిద్రలో ఉన్న అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణి సిసిలీ ఫ్లోర్స్‌ను కిడ్నాప్ చేసి ఏకంగా అరికాకే తీసుకుపోయింది. నార్కో టెర్రరిస్టు అని అభియోగం మోపి న్యూయార్క్ కోర్టులో ప్రవేశపెట్టింది. తాను వెనిజులా అధ్యక్షుడినని, ఎలాంటి నేరం చేయలేదని మదురో కోర్టులో చెప్పాడు. తదుపరి ఏం జరుగుతుందో తెలియదు. తామే వెనిజులాను నడిపిస్తామని ట్రంప్ ప్రకటించాడు.

అంతర్జాతీయ సంస్థలు ఏం చేస్తున్నాయో తెలియడం లేదు. ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగజ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక తమకు సహకరించకపోతే మదురో కంటే ఎక్కువగా అనుభవించాల్సి వస్తుందని ట్రంప్ ఆమెను కూడా బెదిరించాడు. అయితే అంతర్జాతీయంగా వస్తున్న సమాచారం మేరకు . వెనిజులాలోని చమురు నిక్షేపాలను ఆక్రమించుకోవడం అమెరికా ఎత్తుగడగా ఉంది.. అమెరికా చర్యను ఐరాస ఖండించింది. మదురోను ఎలా పట్టుకున్నారు, అందుకు అనుసరించిన పద్ధతేమిటి అనే అంశాలు ఎలా ఉన్నా ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాల్సిన అవసరం మాత్రం ఉంది. దీనిపై ప్రపంచ దేశాలను కూడాగట్టాల్సి ఉంది. ముదురో అపహరణ సమయంలో జరిగిన ప్రతిఘటనలో 80 మంది మ-రణించారని, వారిలో 32 మంది క్యూబన్లు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్ కూడా యూదుల మారణకాండకు పాల్పడ్డాడు. నరమేధం సృష్టించాడు. గ్యాస్ ఛాంబర్‌లు పెట్టి లక్షల మందిని పొట్టన పెట్టుకున్నాడు. అనేక దేశాలను ఆక్రమించుకుంటూ పోయినా ప్రజాస్వామిక ముసుగు వేసుకున్న దేశాలేవీ అడ్డుకోలేదు. అప్పట్లో అమెరికా ఆయుధాలు కూడా అందించింది. అయితే రష్యా అధినేత స్టాలిన్ నాయకత్వంలో ప్రతిఘటించిన తరవాతనే హిట్లర్ ఆత్మహత్య చేసుకొని దిక్కులేని చావు చచ్చాడు. ఇండియాలో కూడా బ్రిటిషర్లు ఇలాగే వ్యవహరించాలరు. అంతకు ముందు మొగలులు కూడా దాడులు చేసి హిందూ ఆలయాలను ధ్వంసం చేసి ప్రజలను ఊచకోత కోశారు. మతమార్పిళ్లు చేశారు. తెలంగాణలో నైజాం నిరంకుశ రజాకార్లు కూడా ప్రజలను ఊచకోత కోశారు. ఇవన్నీ కూడా హిట్లర్‌ను మించి జరిగాయి. కాశ్మీర్‌లో మారణహోమం చూశాం. మతమార్పిళ్లు చూశాం. ఊచకోతలు చూశాం. ఇకపోతే దేశాన్ని ముక్కులు చేసేలా బ్రిటిషర్లు కుట్రలు చేశారు. అయితే ఇప్పుడు ప్రపంచ వ్యవస్థ మారింది. ఆధునిక ప్రపంచంలో ఇటీవల ఉక్రెయిన్‌పై రష్యా దాడిని, ఇప్పుడు వెనిజువెలాపై అమెరికా దాడిని చూస్తున్నాం. ఈ రెండు దేశాలు సైనికంగా బలంగా ఉండడంతో తమను ఎవరేమీ చేయలేరన్న ధీమాతో దాడులకు తెగించారు. చరిత్రను చూస్తే ప్రజాస్వామ్యం, మానవ హక్కుల గురించి ప్రపంచానికి నిత్యం నీతిసూత్రాలను బోధించే అమెరికా అడుగడుగునా వాటిని ఉల్లంఘించడం చూస్తున్నాం.

తమ దారికి రాని వారిని ఏం చేస్తామో ఇది ప్రారంభం మాత్రమే అని మదురో అపహరణ తరువాత ట్రంప్ చెప్పాడంటే రానున్న రోజుల్లో ఇంకా ఎన్ని దాడులు చూడాల్సి వస్తుందో, ప్రపంచానికి ఎలాంటి ముప్పురానుందో అన్నది ప్రపంచ దేశాలు ఆలోచించాల్సి ఉంది. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ రూపంలో ఉన్న అమెరికన్ ఫాసిస్టు శక్తిని నిలువరించేది ఎవరనేదే కాలమే చెప్పాలి. తమ తదుపరి లక్ష్యం మెక్సికో, కొలంబియా, క్యూబా అని కూడా ట్రంప్ చెప్పాడు. ట్రంప్ సామ్రాజ్య విస్తరణ కాంక్ష వెనిజులా ఉదంతం స్పష్టం చేసింది. అంతకు ముందు డెన్మార్క్ స్వయంపాలిత గ్రీన్‌లాండ్ తమకు కావాలని చెప్పిన సంగతి తెలిసిందే. అది కూడా త్వరలోనే స్వాధీనం చేసుకునేదాకా వదిలేట్టుగా లేదు. కెనడాను కూడా ఇలాగే బెదరించాడు. ఏది కావాలంటే దాన్ని స్వాధీనం చేసుకొనే ట్రంప్ తరహా సామ్రాజ్యవాదం ముదరితే మళ్లీ బ్రిటిష్ తరహా సామ్రాజ్యం అమెరికా ప్రారంభిస్తుందా అన్న ఆందోళన కలుగుతోంది.

# ఫిబ్రవరి 1న బడ్జెట్‌పై సందిగ్ధం

- ఆదివారం కావడంతో కొంత చర్చ
- త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం

**న్యూఢిల్లీ, జనవరి 7 :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే బడ్జెట్ ప్రతిపాదనలను ఫిబ్రవరి1న ప్రవేశ పెడతారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం రావడంతో అదే రోజు ప్రవేశపెడతారా? అనే చర్చ జరుగుతోంది. అలా కానట్లయితే 2న ప్రవేశ పెట్టే అవకాశం కూడా ఉంటుంది. అయితే దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్తేమీ కాదు. తొలిసారిగా 2016లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్‌ను ఆదివారమే ప్రవేశపెట్టారు. ఆ తరువాత 2025లోనూబడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టారు. 2020లో కరోనా సమయంలోనూ, అంతకు ముందు 2012 మే 13న ఆదివారం పార్లమెంట్ సమావేశం జరిగింది. ఈ లెక్కన పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం కూడా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టే అవకాశం లేకపోలేదు. గతంలో కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరిరోజున సమర్పించేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. దీంతో కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి ప్రభుత్వ ఖర్చుల కోసం కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులను ఉపసంహరించు కునేందుకు వీలుగా పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్'ను ఆమోదించాల్సి వచ్చేది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు శాఖాపరమైన డిమాండ్లను వివరంగా పరిశీలిం చిన తరువాత, మిగిలిన సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ఆమెదించే వారు. ఇది తీవ్రజాప్యాలకు దారితీస్తుండ టంతో.. దీన్ని నివారించేందుకు 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే అంటే మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది. ఈక్రమంలో ఈ యేడాది కూడా ఫిబ్రవరి 1ననే బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి అభ్యంతరం ఉండకపోవచ్చు. ఇకపోతే ఇప్పటికే ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడస్జెట్ కసరత్తు మొదలు పెట్టారు. వివిధ శాఖలనుంచి నివేదికలు తెప్పించుకున్నారు.



## రష్యా నుంచి భారత్‌కు రూ.15 లక్షల కోట్ల
# చమురు దిగుమతి

### ఐరోపా సంస్థ



**న్యూఢిల్లీ :** ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలైన దగ్గరి నుంచి డిస్కౌంట్ ధరకు లభిస్తోన్న రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోన్న సంగతి తెలిసిందే. అప్పటినుంచి 144 బిలియన్ యూరోల (రూ.15 లక్షల కోట్ల విలువైన) క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంది. దిగుమతి చేసుకున్న మొత్తం శిలాజ ఇంధనాల విలువ 162.5 బిలియన్ యూరోలుగా ఉంది. ఈ మేరకు ఐరోపా సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్‌ఎయిర్ వెల్లడించింది. అలాగే ఫిబ్రవరి, 2022 (యుద్ధం మొదలైన ఏడాది) నుంచి ప్రపంచ దేశాలకు చమురు అమ్మడం ద్వారా రష్యా ఒక ట్రిలియన్ యూరోల ఆదాయాన్ని పొందిందని అంచనా వేసింది. రష్యా రాయితీ ధరలకు చమురును విక్రయించడం ప్రారంభించడంతో చైనా తర్వాత మన దేశం అతిపెద్ద దిగుమతిదా ుగా మారింది. ఫలితంగా మొత్తం మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% నుంచి 40 శాతానికి చేరింది. ఇక చైనా 210. 3 బిలియన్ యూరోల చమురును కొనుగోలు చేసిందని సీఆర్ ఈఏ వెల్లడించింది. గ్యాస్, బొగ్గు దిగుమతులతో కలిపి ఆ మొత్తం 293.7 బిలియన్ యూరోలుగా ఉందని తెలిపింది. ఈ దిగుమతులపై అమెరికా, దాని మిత్ర దేశాలు గగ్గోలు పెడుతోన్న సంగతి తెలిసిందే. ఈ కొనుగోళ్ల ద్వారా ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు భారత్ ఆర్థికంగా సహకరిస్తుందని మిత్ర దేశాలు ఆరోపించాయి. పుతిన్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆయిల్ ఉత్పత్తిదారులైన లుకోయిల్, రాస్‌నెఫ్ట్‌పై అమెరికా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. భారత్‌పై నిందలు మోపిన ఐరోపా యూనియన్ దేశాలు.. ఈ నాలుగేళ్లలో రష్యా శిలాజ ఇంధనాల దిగుమతులపై 218.1 బిలియన్ యూరోలు వెచ్చించడం గమనార్హం.



## సుక్మా జిల్లాలో 26 మంది మావోయిస్టుల లొంగుబాటు

**సుక్మా:** ఛత్తీస్‌గఢ్‌లో 26 మంది మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట బుధవారం సరెండర్ అయ్యారు. వీరిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో 13 మందిపై రూ.64 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్, సౌత్ బస్తర్ డివిజన్, మడ్ డివిజన్, ఆంధ్రా-ఒడిశా డివిజన్‌కు చెందిన మావోయిస్టులు లొంగిపోయిన వారిలో ఉన్నారని ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. అబూజ్‌మడ్, సుక్మా, ఒడిశా సరిహద్దుల్లో జరిగిన పలు హింసాత్మక ఘటనల్లో వీరి పాత్ర ఉందని పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు.

## 50 కోట్ల జీఎస్టీ పన్ను ఎగవేత

- ఆరెంజ్ డైరెక్టర్ సునీల్ కుమార్ అరెస్ట్
- ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ఎంపి చేతన్ కూడా అరెస్ట్

**హైదరాబాద్, జనవరి 7 :** జీఎస్టీ పన్ను ఎగవేత కేసులపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ హైదరాబాద్ జోనల్ యూనిట్ దాడులను మరింత ముమ్మరం చేసింది. డేటా అనలిటిక్స్, అంతర-ఏజెన్సీ సమన్వయంతో సేకరించిన ప్రత్యేక సమాచారంతో, భారీ స్థాయిలో జరుగుతున్న అంతర్రాష్ట్ర పన్ను మోసాల వెనుక ఉన్న కీలక వ్యక్తులపై చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జీఎస్టీ చట్ట ఉల్లంఘనలకు పాల్పడ్డ ఇద్దరు ప్రముఖ కంపెనీల మేనేజింగ్ డైరెక్టర్లను డీజీజీఐ అధికారులు అరెస్టు చేశారు. జనవరి 6న జరిగిన ఈ అరెస్టులు పన్ను మోసాల తీవ్రతను మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. మెస్‌ర్స్ ఆరెంజ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ప్రయాణికుల నుంచి వసూలు చేసిన రూ.28.24 కోట్ల జీఎస్టీని గడువు ముగిసిన మూడు నెలలు గడిచినా ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా అక్రమంగా దాచుకున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. అదే విధంగా, మెస్‌ర్స్ ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చేతన్ ఎన్ రూ.22 కోట్ల మేర నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసానికి సూత్రధారిగా వ్యవహరించినట్టు డీజీజీఐ గుర్తించింది. ఈ ఇద్దరిపై సీజీఎస్టీ చట్టం నిబంధనల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. సంఘటితంగా జరుగుతున్న పన్ను మోసాలపై నిరంతర ఒత్తిడి కొనసాగించేందుకు ఈ చర్యలు తీసుకున్నామని డీజీజీఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ స్పష్టం చేసింది. పన్ను చెల్లింపుదారులు చట్టాన్ని గౌరవిస్తూ వ్యవహరించాలని, జీఎస్టీ ఎగవేతకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని డీజీజీఐ హెచ్చరించింది.

## హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

### 'బాకీ కార్డుల'ను ఆవిష్కరించిన శ్రీనివాసగౌడ్

**మహబూబ్‌నగర్, జనవరి 7 :** మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ 'బాకీ కార్డుల'ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలను అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా విఫలమైనదని ఆరోపించారు. మహిళలకు, వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం, విద్యార్థులకు స్కూటీలు, రైతులకు రైతు భరోసా సహాయం మరియు రు-ణమాఫీ చేయకుండా ప్రజలకు బాకీ పడిందన్నారు. ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ నాయకులను ఎక్కడిక్కడ నిలదీయాలన్నారు. ఈ బాకీలు ఎప్పుడూ చెల్లిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## ఎక్కడో కూర్చొని ఉచిత సలహాలు ఇస్తుంటారు

### జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ల్బంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

## జైలులో మత్తు పదార్థాల సరఫరా

### నిజామాబాద్ జైలర్ ఉపేందర్ సస్పెన్షన్

**నిజామాబాద్, జనవరి 7 :** జిల్లా జైలులో గంజాయి దొరికిన ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. జైలులో డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలు సరఫరా అవుతుందన్న ఆరోపణలపై జైళ్ల శాఖ డీఐజీ, ఐజీ పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. ఈ విచారణ నివేదిక ఆధారంగా జైలర్ ఉపేందర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మరో జైలర్ సాయి సురేశ్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే సూపరింటెండెంట్ దశరథాన్ని నెల రోజులు సెలవులపై వెళ్లాలని ఆదేశించారు.ఇక వరంగల్ జైలర్‌గా పనిచేస్తున్న పూర్ణచందర్‌కు నిజామాబాద్ జైలర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆనంద్‌రావుకు ఇంచార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. జైలు అధికారులతో కలిసి పని చేసినట్లు తేలిన ఖైదీలను ఇతర జైళ్లకు మార్చారు.




## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

### నవీన్ రావు తండ్రికి సిట్ నోటీసులు

**హైదరాబాద్, జనవరి 7 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండల్ రావుకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అంతేకాదు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కొడుకు సందీప్ రావుకు కూడా నోటీసులు ఇచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు జూబ్లీహిల్స్ పీఎస్‌కి రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ నవీన్ రావును సిట్ అధికారులు విచారించారు. దాదాపు 9 గంటల పాటు విచారణ సాగింది. ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ రాత్రి 8 గంటల వరకు సాగింది. బీఆర్ఎస్ పెద్దలతో ఉన్న ఆర్థిక సంబంధాల గురించి నవీన్ రావును అధికారులు విచారించినట్లు సమాచారం. విచారణ అనం తరం నవీన్ రావు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో విచారణకు హాజరయ్యానని, అప్పట్లో మూడు గంటల పాటు అధికారులు తనను విచారించారని చెప్పారు. అప్పుడు చెప్పిన విషయాలనే ఇప్పుడు కూడా చెప్పానని అన్నారు. విచారణకు సహకరించానని, మళ్లీ పిలిచినా కూడా వస్తానని స్పష్టం చేశారు.

## ఢిల్లీలో కాలుష్యానికి తోడు చలి తీవ్రత

**న్యూఢిల్లీ, జనవరి 7 :** ఢిల్లీలో గాలి నాణ్యతలు పడిపోయాయి. చలి తీవ్రత కూడా పెరిగింది. బుధవారం ఉదయం, మధ్యాహ్నం దట్టమైన పొగమంచు కురవడంతో భారత వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్‌ని జారీ చేసింది. బుధవారం ఉదయం ఢిల్లీలో ఎక్యూఐ 336 స్థాయి వద్ద నమోదైంది. దీంతో వీటి స్థాయిల్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) వెరీ పూర్ కేటగిరీలో వర్గీకరించింది. నెహ్రూ నగర్‌లో ఎక్యూఐ 360 స్థాయిలు నమోదయ్యాయి. 21 పర్యవేక్షణా కేంద్రాల్లో ఎక్యూఐ స్థాయిలు వెరీ పూర్, 14 కేంద్రాల్లో పూర్ కేటగిరీలో ఎక్యూఐ స్థాయిలు నమోదయ్యాయని సిపిసిబి పేర్కొంది.



## నూతన తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సవాయిసింగ్

**బీర్కూర్, రాజముద్ర న్యూస్ :** బీర్కూర్ మండల తహసిల్దార్ గా సవాయిసింగ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎల్లారెడ్డి ఆర్ డి ఓ ఆఫీస్ లో డెవలప్మెంట్ ఆఫీసర్గా విధులు నిర్వహించి, బీర్కూర్ తహసిల్దార్ గా వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసిల్దార్ సాయి భుజంగరావు నిజాంసాగర్ మండలానికి బదిలీ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ సవాయిసింగ్ మాట్లాడుతూ బీర్కూర్ మండలంలో అక్రమ ఇసుక, మొరం, మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ రవికుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన రీజియన్ మేనేజర్ జ్యోష్ణ

**బాన్సువాడ, రాజముద్ర న్యూస్ :** బాన్సువాడ ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన రీజియన్ మేనేజర్ జ్యోత్స్న. ఈ సందర్భంగా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ డిపో ను నష్టాల నుంచి లాభాల బాటలోకి తేవాలని సూచించారు. డిపోలో ఉన్న గ్యారేజ్ ఉన్న టైర్ మైలేజ్, ఆయిల్ సెక్షను క్షణ్ణంగా పరిశీలించారు. డిపో ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలన్నారు. ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించే విధంగా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేసి డిపోను లాభాల బాటలో అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రవికుమార్, సిబ్బంది బసంత్, పారు, , కిష్టయ్య, మంజుల, రాజారాం పాల్గొన్నారు.




## వున్నం బ్రహ్మయ్యని పరామర్శించిన కేటీఆర్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** వున్నం అచ్చమ్మ మరణం కుటుంబానికి,పార్టీకి తీరని లోటని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.నేలకొండపల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య మాతృమూర్తి అచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు.ఖమ్మం పర్యటనకి వచ్చిన కేటీఆర్ బుధవారం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డితో కలిసి బ్రహ్మయ్య నివాసాన్ని సందర్శించి అచ్చమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి,మనో ధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు శీలం వెంకటలక్ష్మ, బొడ్డు వసంత, అమరగాని ఎల్లయ్య,కోటి సైదా రెడ్డి,వక్కలపాటి విశాల, ధరావత్ సరోజినీ,దండా రంగయ్య,మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మ,మాజీ సర్పంచ్ భూక్యా సుధాకర్, పార్టీ శ్రేణులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లాంకెట్స్ పంపిణీ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యంతో ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని గ్రేస్ సర్వీస్ సొసైటీ బాధ్యులు జాన్ అన్నారు.ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం,పాండురంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాలలో చదివే 1000 మంది విద్యార్థులకు బుధవారం బ్లాంకెట్స్,టెడ్డీబేర్స్,ఇతర బొమ్మలను ఉచితంగా అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆటలు,వినోదంతో పాటుగా చదువు పై ఏకాగ్రత చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు,విజయలక్ష్మ,ప్రేమలత,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## కూడలి వాణిజ్య సముదాయాల పార్కింగ్‌తో ప్రజలకు ఇక్కట్లు

**అధికారులు చూస్తున్నా కూడా పట్టించుకోకపోవడం పై ప్రజల ఆగ్రహం**

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** 263 డివిజన్ తెల్లాపూర్ గద్దర్ సర్కిల్ సమీపంలో ఇందిరానగర్, కొమురం భీమ్ కాలనీ లకు వెళ్లే దారి పక్కన హోటల్, పాన్ షాప్ లు, టీ కొట్టులు, ఇతర తినుబండారాల దుకాణాలతో ఈ సర్కిల్ ప్రాంతం ప్రతిరోజు ఉదయము సాయంత్రము రద్దీ నెలకొంటుంది. ఉదయం పూట సాయంత్రం పూట విద్యార్థులు ఉద్యోగస్తులు వ్యాపారస్తులు ఈ దారి గుండా ప్రతిరోజు ప్రయాణం చేస్తుంటారు. ఆ సమయంలో ఇక్కడ రద్దీ తో పాటు పార్కింగ్ చేసే బండ్లు అనేకంగా ఉంటాయి. ఈ సర్కిల్ ప్రాంతంలో ఇక్కడ ప్రతిరోజు ఏదో ఒక పూట వాహనదారులు ఎవరితో ఒకరికి గొడవలు జరుగుతూనే ఉంటాయి. జిహెచ్ఎంసి ఆఫీస్ కు కూత వేటు దూరంలో ఉన్న ఈ సమస్యపై అధికారులు స్పందించకపోవడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అస్తవ్యస్త పార్కింగ్ తో ఇబ్బంది పడుతున్న ప్రజలు స్థానిక ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ అవసరమని వాపోతున్నారు.

## నూతన పరిశోధనలకు కామారెడ్డి సైన్స్ ఫెయిర్ వేదిక కావాలి

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి లోని అబ్దుల్ కలాం ప్రాంగణం విద్యానికేతన్ హై స్కూల్ నందు నిర్వహిస్తున్నటువంటి ఇన్స్పైర్ మనక్ అవార్డ్స్ మరియు 53వ రాజ్యస్తరీయ బాల్ వైజ్ఞానిక్ ప్రదర్శిని ఏర్పాట్లను గౌరవ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించి సమీక్షంచడమే కాక పలు సూచనల ను సలహాలను ఇవ్వడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుండి 887 ప్రదర్శనలు సైన్స్ ఫెయిర్ కు రానున్న సందర్భంగా ఏడు సత్యంస్లో వారేగా వర్గీకరించి వాటికి రూములను కేటాయించి తగు ఏర్పాట్లను చేయడం జరిగింది ప్రతి ఒక్క విభాగానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ మెంత్తం 27 విభాగాలలో కమిటీలను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులకు విజ్ఞాన శాస్త్ర అభిమానులకు భావితరాల సైంటిస్టులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయడం జరిగింది ఏర్పాట్లను సమీక్షంచిన గౌరవ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ విద్యార్థులకు ముఖ్యంగా మంచినీటి వసతిని మరియు భోజన వసతిని సౌకర్యవంతంగా ఉంచాలని భావిశాస్త్రవేత్తలకు అనుగుల మైనటువంటి వాతావరణాన్ని కల్పించడం ద్వారా వారిలో కొత్త ఆలోచనలను రేకెత్తించి రాబోవు తరాలకు సౌకర్య



మంతమైనటువంటి పరిశోధనలు చేసే దిశగా వారి ఆలోచన దృక్పథన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించడం జరిగింది. ప్రతి సంవత్సరం జరిగే కార్యక్రమమే అయినప్పటికీ ప్రస్తుతం ఆధునికత లైట్ వేగంతో దూసుకుపోతున్న తరుణంలో నూతన ఆవిష్కరణల ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ దిశగా కామారెడ్డి సైన్స్ ఫెయిర్ కేంద్ర బిందువు కావాలని సూచించడం జరిగింది.

## కేసీఆర్ కోటలో హస్తం హవా

- మెజార్టీ గ్రామాలలో కాంగ్రెస్ జయకేతనం
- కాంగ్రెస్ శ్రేణుల సమిష్టి కృషితోనే కాంగ్రెస్ అభ్యర్థుల విజయం : నీలం మధు ముదిరాజ్
- గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ సర్పంచ్ లకు ఘన సన్మానం



**గజ్వేల్ :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగిస్తూ మెజార్టీ స్థానాలలో జయకేతనం ఎగురవేయడం సంతోషకారమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం మెదక్ పార్లమెంటు పరిధిలోని సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో విజయం సాధించిన సర్పంచ్ లు, జిల్లా సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షుడిగా ఎన్నికైన మన్నె కళ్యాణ లు గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తో కలిసి నీలం మధు ను చిట్కుల్ ఎన్ఎంఆర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయకేతనం ఎగురవేసిన సర్పంచ్ లను, ఉపసర్పంచ్లు, వార్డ్ సభ్యులను ఆయన అభినందించి ఘనంగా సత్కరించారు. గజ్వేల్ లో కాంగ్రెస్ తో నే అభివృద్ధి సాధ్యమని నమ్మి ప్రజలు కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులకు పట్టం కట్టారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థుల విజయంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తో పాటు కాంగ్రెస్ శ్రేణులు కృషి మరువలేనిదని కొనియాడారు. నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటు గ్రామాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మనోహరబాద్ గ్రామ సర్పంచ్ భాస్కర్ యాదవ్, జీడిపల్లి గ్రామ సర్పంచ్ నర్సన్న గారి కృష్ణ, కొండాపూర్ గ్రామ సర్పంచ్ నూకల రాము, వెంకటాపూర్ అగ్రహారం గ్రామ సర్పంచ్ వెంకటేష్, గౌతజిగూడా గ్రామ సర్పంచ్ నాగరాజు , ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు, సర్పం చులు, ఉపసర్పంచ్లు, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## మోమిన్‌పేట్‌లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు రోడ్డు భద్రతపై కీలక సందేశాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు నిర్లక్ష్యం, అజాగ్రత్త, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలేనని తెలిపారు. రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ తమ ప్రాణ భద్రతతో పాటు తమ కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్, వన్-వే నియమాలు, ఓవర్‌టేకింగ్ నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. రోడ్డు పై ప్రయాణించే సమయంలో మీ భద్రత మీ చేతుల్లోనే ఉంటుంది. ట్రాఫిక్ నియమాలను పాటిస్తేనే ప్రాణ రక్షణ సాధ్యం అని ఎస్పీ తెలిపినారు. విద్యార్థులు, యువత రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకొని, తమ కుటుంబ



సభ్యులకు, మిత్రులకు కూడా ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించాలని కోరారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీసుల చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ వాహనదారులతో కలిసి రోడ్డు భద్రతపై సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ ద్వారా ట్రాఫిక్ నియమాల పాటింపు, రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, మోమిన్‌పేట్ ఎస్.ఐ అరవింద్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వాహనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు నిర్వహించాలి

- నిర్దేశించిన లక్ష్యల మేరకు ప్రసవాలు నిర్వహించాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, పర్యవేక్షంచే సిబ్బందితో వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లా పరిధిలో జరిగే ప్రసవాలు వీలైనంత ఎక్కువగా సాధారణ ప్రసవాలు జరిగే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు నిర్వహించాలని, ముఖ్యంగా 24 గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తప్పనిసరిగా నిర్దేశించిన లక్ష్యల మేరకు ప్రసవాలు నిర్వహించాలని , సిజేరియన్ ప్రసవాలను ప్రోత్సహించరాదని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే జరిగే విధంగా చూడాలని తెలిపారు. సిజేరియన్ ప్రసవాలకు గల కారణాలను సిజేరియన్ నిర్వహించిన ఆసుపత్రులలో ఆడిట్ నిర్వహించాలని పుట్టిన ప్రతి బిడ్డకు కచ్చితంగా వాక్సినేషన్ చేయాలని జిల్లాలో టీకా కరణ కార్యక్రమం 100 శాతం ఉండే విధంగా ప్రతి పీహెచ్ సి వైద్యాధికారి జాగ్రత్త వహించాలని, అందించిన అన్ని రకాల సేవలను హెచ్ ఎం ఐ ఎస్ పోర్టల్, ఎం సి హెచ్ పోర్టల్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. వికారాబాద్ జి జి హెచ్ లో ఉన్న క్యాన్సర్ కేర్ సెంటర్ కు జిల్లా పరిధిలో చికిత్స పొందుతున్న క్యాన్సర్ రోగులు క్రమానుగతంగా సేవలు పొందే విధంగా జాగ్రత్తలు వహించాలని ప్రతి పీహెచ్సీ వైద్యాధికారి ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అవుట్ పేషెంట్ సేవలను కొనసాగించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సేకరించిన రక్త నమూనాలను జిల్లా కేంద్రంలోని టీ హబ్ కు పంపించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో తీవ్ర పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను గుర్తించి చికిత్స అందించి ప్రతి నెల 15వ తేదీ లోపు వారి పోషకాహార లోపం, ఎదుగుదలను పర్యవేక్షంచాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వరలక్ష్మ, డాక్టర్ పద్మ, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రవీణ్ , డిప్యూటీ డెమో శ్రీనివాసులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పర్యవేక్షక సిబ్బంది పాల్గొన్నారు.



## భాస్వరం కరిగించే బ్యాక్టీరియాపై క్షత్ర ప్రదర్శన

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** భాస్వరం కరిగించే బ్యాక్టీరియాను వినియోగించడం వల్ల భూమిలో పేరుకుపోయిన భాస్వరాన్ని కరిగించి మొక్కకు అందుబాటులో స్థితిలోకి తీసుకునివస్తుందని కూసుమంచి మండల వ్యవసాయాధికారిణి రామడుగు వాణి అన్నారు.మండలంలోని రావిచెట్టుతండా గ్రామంలో బుధవారం భాస్వరం కరిగించే బ్యాక్టీరియాపై నారు కట్టలు పిఎస్బి ద్రావణంలో ముంచే పద్ధతి గురించి క్షత్ర ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఎస్బి ద్రావణాన్ని విత్తన శుద్ధి ద్వారా నారుకట్టలు ముంచే పద్ధతిలో,ప్రధాన పొలంలో పశువుల ఎరువుతో కలిపి చల్లించాలని తెలిపారు.ఈ మూడు పద్ధతుల్లో ఏదో ఒక పద్ధతిని అనుసరించి వినియోగించడం ద్వారా భూమిలో పేరుకుపోయిన భాస్వరాన్ని కరిగించడమే కాకుండా భాస్వరం ఎరువులపై పెట్టే ఖర్చును కూడా తగ్గించుకోవచ్చని వివరించారు.అదే విధంగా నారు కట్టలు ముంచే పద్ధతిలో 20 నుండి 25 లీటర్ల నీటిలో 500 మిల్లీలీటర్లు పిఎస్బి ద్రావణాన్ని కలిపి ఎకరానికి సరిపడే నారు కట్టలను 20 నిమిషాల పాటు ముంచిన తర్వాత నాటు వేసుకోవాలన్నారు.ప్రధాన పొలంలో వాడే విధానంలో 100 కేజీల పశువుల ఎరువులో ఒక లీటర్ పిఎస్ బి ద్రావణాన్ని కలిపి చల్లుకోవాలని రైతులకి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జానీ బాబా,రైతులు వరుణ్, కోటేశ్వరావు,తదితరులు పాల్గొన్నారు.



## పుష్పలంకరణ వేడుకలో పాల్గొన్న ఓడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్

**వాజేడు,రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో కోరకల్ గ్రామంలో ఓడబలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్ బుధవారం తోట గోవర్ధన్,సరస్వతి దంపతుల కుమార్తె సంజన పుష్పాలంకరణ వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఓడబలిజ సేవ సంఘం రాష్ట్ర జిల్లా ఉపాధ్యక్షులు గగ్గూరి రమణయ్య, ములుగు జిల్లా ఉపాధ్యక్షులు గార తిరుపతి,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోట ప్రశాంత్, మండల కోశాధికారి పానేం సురేష్, మండల అధికార ప్రతినిధి బొల్లె ఆదినారాయణ, కృష్ణార్జున్,గగ్గురి అశోక్,కన్నాయిగూడెం మండల అధ్యక్షులు ఎర్రావుల సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.



## మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

**సర్పంచ్ మేడి విజయ**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** విద్యార్థులకు నాణ్యతతో కూడిన పోషకాహారం తప్పకుండా అందించాలని సర్పంచ్ మేడి విజయ అన్నారు.కూసుమంచి మండలంలోని గట్టుసింగారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు.పాఠశాల ఆవరణలో,తరగతి గదుల్లో కలియ తిరుగుతూ మౌలిక వసతులు,పరిశుభ్రతను పరిశీలించారు.అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి,విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం పాఠశాల విద్యార్థులకు గుడ్డుతో కూడిన మధ్యాహ్నం భోజనం వండించాలని సూచించారు.ప్రతి విద్యార్థి పై వ్యకిగత శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని కోరారు.అదే విధంగా ఎర్లీ చైల్డ్ రీడ్, ఎఫ్ఎల్ఎస్,ఎఫ్ఎల్ఎన్ ల పై ప్రత్యేక దృష్టి సారించాలని సర్పంచ్ విజయ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శీలం జానయ్య,పంచాయతీ కార్యదర్శి సాలె ఉపేందర్,ప్రధానోపాధ్యాయులు పంతు,సోమయ్య,ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.





## ఉచిత దంత వైద్య శిబిరం

**ఆత్మకూర్(ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ ( ఎం )మండలం సిద్దాపురం గ్రామంలో గత నాలుగు రోజుల నుండి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆత్మకూర్( యం)వారి సౌజన్యంతో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ గుమ్మి ఉజ్వల రెడ్డి ఫామ్ హౌస్ లో సుమారుగా 120 మందికి ఉచిత దంత వైద్యం అందించారు.వైద్య శిబిరానికి వచ్చిన వారికి భోజన సదుపాయం కూడా కల్పించారు.



# ప్లీజ్ డొనాల్డ్ అంటూ.. మేక్రాన్ నన్ను ప్రాధేయపడ్డారు: ట్రంప్

**న్యూయార్క్:** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్‌ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షడు డొనాల్డ్ ట్రంప్ హేళనగా మాట్లాడారు. ప్లీజ్ డొనాల్డ్ అంటూ మేక్రాన్ ప్రాధేయపడ్డారని రిపబ్లికన్ చట్టసభ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ వ్యాఖ్యలు చేశారు. గతంలో జరిగిన సమావేశం గురించి ప్రస్తావించారు. "ఫ్రాన్స్ ఔషధ ధరలను మూడింతలు పెంచాలని మేక్రాన్‌ను అడిగాను. ఆయన అందుకు తొలుత అంగీకరించలేదు. దాంతో ఆ దేశం నుంచి దిగుమతి అవుతోన్న వస్తువులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించాను. దాంతో మన డిమాండ్లను అంగీకరించాల్సి వచ్చింది. అప్పుడు మేక్రాన్ మాట్లాడుతూ.. 'డొనాల్డ్ మన మధ్య ఒప్పందం ఉంది. ఔషధాల ధరలను మీకు కావాల్సినంత పెంచుతాను. కానీ మా ప్రజలకు చెప్పకండి' అని ప్రాధేయపడ్డారు" అంటూ ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 10 డాలర్లు ఉన్న ఒక మందుబిళ్ల ధరను ఫ్రాన్స్ 30 డాలర్లకు పెంచిందన్నారు. ఫ్రాన్స్ ఔషధాల ధరలు తక్కువగా ఉండటంతో అమెరికాలో ఎక్కువ విక్రయమయ్యేవి. దీంతో అమెరికా కంపెనీలకు నష్టం వాటిల్లేది. ట్రంప్ సూచన మేరకు ఫ్రాన్స్ ఆ ధరలు పెంచడంతో అమెరికాలో స్థానిక కంపెనీల ఔషధాలకు డిమాండ్ పెరిగిందని వైద్యరంగ నిపుణులు విశ్లేషించారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై మేక్రాన్ కానీ, ఫ్రాన్స్ ప్రభుత్వం నుంచి కానీ ఎలాంటి స్పందనారాలేదు. ఇదిలా ఉంటే.. రష్యా (=బం-ంఋ) నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై తాము విధించిన సుంకాల కారణంగా భారత ప్రధాని నరేంద్రమోదీ అంత ఆనందంగా లేరని ట్రంప్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే.



# పాకిస్థాన్‌లో లష్కరే తయ్యిబా-హమాస్ కమాండర్ల సమావేశం

**పాకిస్థాన్:** ఉగ్రవాద మద్దతు సంస్థలకు ఆశ్రయం కల్పించడంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన పాకిస్థాన్ తాజాగా ఉగ్ర ముఠా లష్కరే తయ్యిబా.. హమాస్ నేతల సమావేశానికి వేదికగా మారింది. ఇటీవల పాకిస్థాన్‌లోని గుజ్రాన్‌వాలాలో పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్ నిర్వహించిన కార్యక్రమంలో హమాస్ సీనియర్ కమాండర్ నాజీ జహీర్ పాల్గొన్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. అతడు లష్కరే తయ్యిబా కమాండర్ రషీద్ అలీ సంధుతో భేటీ అయినట్లు తెలుస్తోంది. ఈ రెండు ఉగ్రవాద గ్రూపుల మధ్య సంబంధాన్ని మరింత పెంచుకోవడానికి ఈ సమావేశంలో చర్చలు జరిపినట్లు సమాచారం. వీరి సమావేశానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌లో హమాస్ జరిపిన ఉగ్ర దాడికి ముందు కూడా హమాస్ సీనియర్ కమాండర్ నాజీ జహీర్ పాకిస్థాన్‌కు వెళ్లాడు. అక్కడ ఆయన జమియత్ ఉలేమా-ఇ-ఇస్లాం అధిపతి మౌలానా ఫజల్-ఉర్-రెహ్మాన్‌ను కలిశారు. పహల్గాంలో ఉగ్ర దాడికి కొన్ని వారాల ముందు కూడా జహీర్ పీవోకేను సందర్శించాడు. ఆ సమయంలో పీవోకేలో లష్కరే తయ్యిబా నిర్వహించిన భారత వ్యతిరేక ర్యాలీలోనూ పాల్గొన్నాడు. తాజాగా అతడు మరోసారి పాక్‌లోని ఉగ్ర సంస్థలతో సమావేశమవడంతో వారు ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడతారోనని అంతర్జాతీయ మీడియా వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. కాగా ఈ కార్యక్రమంలో పాక్ ఆర్మీ అధికారులు కూడా పాల్గొనడం గమనార్హం.



# అమెరికా తర్వాత లక్ష్యం వెనెజువెలా సెక్యూరిటీ చీఫ్

**యూఎస్:** వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను బంధించిన అనంతరం అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న ఆ దేశంలోని ఇతర ముఖ్య అధికారులపై ట్రంప్ దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ దేశ ఇంటీరియర్ మినిస్టర్ డియోస్డాడో కాబెల్లోకు అమెరికా హుకుం జారీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. వెనెజువెలా భద్రతా దళాలు డియోస్డాడో నియంత్రణలోనే ఉండడంతో తమకు పూర్తిగా సహకరించాలని.. లేదంటే మదురోకు పట్టిన గతే పడుతుందని ట్రంప్ ఆయనను హెచ్చరించినట్లు తెలిపాయి. వెనెజువెలా నేతలు తమ మాట వినకపోతే డియోస్డాడోను తదుపరి లక్ష్యంగా చేసుకోవాలని అగ్రరాజ్యం భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ అమెరికా చెప్పిన పనులు చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు అమెరికా పేర్కొంటున్న విషయం తెలిసిందే. అయితే ఇంటీరియర్ మినిస్టర్ డియోస్డాడోతో ఆమెకు విభేదాలు ఉన్న నేపథ్యంలో ఆయన ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్నట్లు ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. దీంతో ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలనే విషయం పైనా దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. వెనెజువెలా రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినోపై కూడా అమెరికా నిఘా పెట్టినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. మరోవైపు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్ మదురోను అమెరికా నిర్బంధించడాన్ని వ్యతిరేకించారు. మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోర్స్‌ను అపహరించి తమ ప్రజాస్వామ్యంపై, దేశ సార్వభౌమత్వంపై యూఎస్ దాడి చేసిందన్నారు. తమ దేశంపై అగ్రరాజ్యం పెత్తనాన్ని తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. అమెరికా దాడిలో మృతి చెందిన సైనికుల కోసం వారం రోజులు సంతాప దినాలు ప్రకటించారు.

# హొరిజన్ ఎక్స్‌పీరియన్షియల్ వరల్డ్ స్కూల్ సౌత్ ఇండియాలో మొదటి ఫిన్నిష్ క్యాంపస్ ను ప్రారంభించింది





**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** హొరిజన్ ఎక్స్‌పీరియన్షియల్ వరల్డ్ స్కూల్(హెచ్ఈడబ్ల్యుఎస్) ఫిన్లాండ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఐఎన్ఈ)తో భాగస్వామ్యం కుదుర్చుకొని హైదరాబాద్‌లో సౌత్ ఇండియాలో మొదటి ఫిన్నిష్ క్యాంపస్‌ను ప్రారంభించింది. భారతీయ విద్యా రంగంలో విప్లవాత్మక అధ్యాయాన్ని సూచిస్తూ, హొరిజన్ ఎక్స్‌పీరియన్షియల్ వరల్డ్ స్కూల్ (హెచ్ఈడబ్ల్యుఎస్) బుధవారం హైదరాబాద్‌లోని కొల్లూరులో సౌత్ ఇండియాలో మొదటి ఫిన్లాండ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ స్కూల్‌ను అధికారికంగా ప్రారంభించింది. టీ సి సి క్లబ్‌లో జరిగిన ఈ భవ్యమైన కార్యక్రమంలో, ప్రపంచవ్యాప్తంగా నంబర్ 1 స్థానంలో ఉన్న ఫిన్నిష్ పెడగాజికల్ మోడల్‌ను తెలంగాణ హృదయభాగంలోకి తీసుకురావాలనే దృష్టిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ నాయకులు, ఇన్నోవేటర్లు ఆరోగ్య నిపుణులు పాల్గొని, రోట్-బేస్డ్ లెర్నింగ్ నుండి ఎక్స్‌పీరియన్షియల్, చైల్డ్-సెంట్రిక్ ఎకోసిస్టమ్‌కు మార్పు అవసరమని నొక్కి చెప్పారు. ప్రారంభోత్సవంలో వినిపించిన స్వరాలు: భవిష్యత్తు-సిద్ధమైన విద్య. ప్రధాన అతిథులు స్కూల్స్‌లో "ఇన్నోవేషన్-ఫస్ట మైండ్‌సెట్ అవసరాన్ని ఒత్తిడి చేశారు. శ్రీనివాస రావు ఎం (సీరియల్ ఎంటర్‌ప్రెన్యూర్ అండ్ మాజీ సీఈఓ,టీ-హబ్) భారతదేశంలో అతిపెద్ద స్టార్టప్ ఇన్‌క్యుబేటర్‌ను నడిపిన తన అనుభవం నుండి ఆయన ఇలా అన్నారు, "ఇన్నోవేషన్‌ను ఒకే కాలేజీ కోర్సులో నేర్పలేం, అది ప్రైమరీ స్కూల్ నుండే పిల్లవాడు పీల్చే వాతావరణం కావాలి. (హెచ్ఈడబ్ల్యాఎస్)కేవలం స్కూల్ మాత్రమే కాదు, ఇది తర్వాతి తరం గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ల కోసం ఇన్‌క్యుబేటర్.డా. జోహన్ స్టోర్‌గార్డ్ (సీఈఓ, (ఎఫ్ఐఎన్ఈ) ఫిన్లాండ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్) గ్లోబల్ భాగస్వామిని ప్రాతినిధ్యం వహిస్తూ ఆయన ఫిన్నిష్ ముఖ్య విలువలను హైలైట్ చేశారు. ఫిన్లాండ్‌లో మేము కేవలం సబ్జెక్టులు మాత్రమే నేర్పము. పిల్లలకు ఎలా నేర్చుకోవాలో నేర్పిస్తాం.(హెచ్ఈడబ్ల్యాఎస్) తో మా భాగస్వామ్యం హైదరాబాద్‌లోని ప్రతి విద్యార్థికి హై-ట్రస్ట్, లో-స్ట్రెస్ వాతావరణంలో ఆనందం క్యూరియాసిటీ అకడమిక్ ఎక్సలెన్స్‌ను నడిపించేలా చేస్తుంది. గెస్ట్స్ ఆఫ్ ఆనర్ డిజైన్, గ్లోబల్ స్టాండర్డ్స్ ఆరోగ్య సమైక్యతను మరింత చర్చించారు. దివాకర్ చింతల (ఫౌండర్, స్టూడియో చింతల) మాట్లాడుతూ, దార్శనిక ఆర్కిటెక్ట్‌గా ఆయన లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్ ప్రాముఖ్యతను గుర్తు చేశారు. స్కూల్ ఆర్కిటెక్చర్ దాని'మూడవ టీచర్ణ.మేము ఈ క్యాంపస్‌ను సింప్లిసిటీ ఫంక్షనాలిటీతో కలిపి డిజైన్ చేశాం, ప్రతి కారిడార్ క్లాస్‌రూమ్‌లో క్యూరియాసిటీ ప్రాబ్లమ్-సాల్వింగ్‌ను రేకెత్తిస్తుంది. రైతా మోచెర్ల (వైస్ ప్రెసిడెంట్, పాంగేయా ట్రేడ్) మాట్లాడుతూ.. గ్లోబల్ కంపిటెన్స్‌పై దృష్టి పెట్టి ఆమె ఇలా అన్నారు,"గ్లోబల్ మార్కెట్‌లో విజయం సాధించాలంటే, పిల్లలకు బార్డర్లను దాటిన విద్య అవసరం. ఈ ఫిన్నిష్ భాగస్వామ్యం భారతదేశంలో క్వాలిటీ స్కూలింగ్‌కు కొత్త ఇంటర్నేషనల్ బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తుంది. డా.లావణ్య (పీడియాట్రిషియన్) మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షమంపై హైలైట్ చేస్తూ ఆమె జోడించారు, డాక్టర్‌గా, యువ మనస్సులపై అకడమిక్ స్ట్రెస్ ప్రభావాన్ని చూస్తున్నాను. ఫిన్నిష్ మోడల్‌లో మెంటల్ హెల్త్ ఫిజికల్ యాక్టివిటీపై ఫోకస్ మన విద్యా వ్యవస్థకు అత్యవసరమైన 'ప్రివెంటివ్ మెడిసిన్ణ.కొల్లూరు, హైదరాబాద్‌కు కొత్త యుగం.(హెచ్ఈడబ్ల్యాఎస్) కొల్లూరు క్యాంపస్ 2026-27 అకడమిక్ సెషన్ కోసం తెరుచుకోనుంది. భారతీయ సాంస్కృతిక విలువలను ఫిన్నిష్ ఎక్స్‌పీరియన్షియల్ టెక్నిక్స్‌తో మిళితం చేసిన కరికులమ్‌ను అందిస్తుంది. అడ్వాన్స్‌డ్ టెక్ ల్యాబ్స్ స్పెషలైజ్డ్ స్పోర్టింగ్ జోన్స్ వంటి వరల్డ్-క్లాస్ సౌకర్యాలతో, స్కూల్ తల్లిదండ్రులను విద్యా భవిష్యత్తును స్వయంగా చూడమని ఆహ్వానిస్తుంది.

# రూ.46 వేల కోట్ల బంగారం.. స్విట్జర్లాండ్‌కు తరలించిన మదురో..



**యూఎస్:** అమెరికా నిర్బంధంలో ఉన్న వెనెజువెలా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో గురించి కీలక విషయం బయటకు వచ్చింది. ఆయన తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు... పెద్ద మొత్తంలో బంగారాన్ని స్విట్జర్లాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. వాటి విలువ మొత్తం 5.20 బిలియన్ డాలర్లు(భారత కరెన్సీలో దాదాపు రూ.46వేల కోట్లు) ఉంటుందని అంచనా. ఈ మేరకు కస్టమ్స్ డేటా ఆధారంగా ఆంగ్ల మీడియాలో కథనాలు వెల్లడిస్తున్నాయి. వాటి ప్రకారం.. ఆర్థిక సంక్షభం సమయంలో దాన్ని నిలబెట్టేందుకు ప్రభుత్వం బంగారం విక్రయాలు చేస్తున్న సమయంలోనే.. ఈ తరలింపు జరిగినట్లు స్విట్జర్లాండ్‌కు చెందిన ఓ బ్రాడ్‌కాస్ట్ సంస్థ పేర్కొంది. 2013 నుంచి 2016 వరకు వెనెజువెలా సెంట్రల్ బ్యాంకు నుంచి దాదాపు 113 మెట్రిక్ టన్నుల విలువైన బంగారాన్ని తరలించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఆ తర్వాత ఈయూ ఆంక్షల నేపథ్యంలో 2017- 2025 వరకు ఆ దేశం నుంచి స్విట్జర్లాండ్‌కు ఎలాంటి బంగారం ఎగుమతులు జరగలేదని కస్టమ్స్ డేటా ద్వారా వెల్లడైంది. మదురో ను నిర్బంధించి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి అభియోగాలను అమెరికా ఆయనపై మోపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మదురోతో సహా ఆయన సహచరులకు సంబంధించి దేశంలో ఉన్న వారి ఆస్తులను స్తంభింపజేయాలని స్విట్జర్లాండ్ ఆదేశాలు జారీ చేసింది. అయితే, వాటి మొత్తం విలువ ఎంత ఉంటుందనే సమాచారం లేదు. ఈ ఆస్తులకు, ఆ దేశ సెంట్రల్ బ్యాంక్ నుంచి బదిలీ అయిన బంగారానికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అనే దానిపై కూడా స్పష్టత లేదు. శుద్ధి, సర్టిఫికేషన్ వంటి వాటి కోసం వెనెజువెలా ఈ బంగారాన్ని తరలించి ఉండొచ్చని తెలుస్తోంది. స్టోన్‌ఎక్స్(అమెరికన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ) మార్కెట్ విశ్లేషకురాలు రోనా ఓకానెల్ మాట్లాడుతూ.. మదురో తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వెనెజువెలా సెంట్రల్ బ్యాంకు నుంచి పెద్దఎత్తున అత్యవసర విక్రయాలు జరిగాయన్నారు. వాటిల్లో ఎక్కువ భాగం స్విట్జర్లాండ్‌కే వెళ్లాయని తెలిపారు. దేశానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను బంగారం రూపంలో చెల్లింపులు చేసి ఉండవచ్చని.. లేదా ఆసియా, ఇతర దేశాలకు చిన్న బార్ల రూపంలో విక్రయాలు జరిపి ఉండవచ్చని పేర్కొన్నారు.

# ముసుగుతో వచ్చే కస్టమర్లకు ఆభరణాలు విక్రయించం


## బిహార్‌లోని ఆభరణాల వర్తక సంఘం కీలక నిర్ణయం



**బిహార్:** జ్యువెల్లరీ దుకాణాల్లో చోరీలను అరికట్టే ప్రయత్నంలో భాగంగా బిహార్‌లోని ఓ ఆభరణాల వర్తక సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. మాస్కులు, హిజాబ్, హెల్మెట్ వంటి వాటితో ముఖాలను కప్పుకొని షాపుల్లోకి వచ్చే కస్టమర్లకు ఆభరణాలు చూపించడం, విక్రయించకూడదని నిర్ణయించింది. దీనిని రాష్ట్రంలో తక్షణమే అమలు చేస్తున్నట్లు ఆ రాష్ట్ర ఆల్ ఇండియా జ్యువెల్లర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్ విభాగం వెల్లడించింది. "ముఖాలకు కప్పుకొని వచ్చే కస్టమర్లకు ఆభరణాలు విక్రయించవద్దని నిర్ణయించాం. హిజాబ్, మాస్కులు, హెల్మెట్ తదితర వాటితో ముఖం కనిపించకుండా షాపుల్లోకి వచ్చే వారికి విలువైన ఆభరణాలు చూపించం. వినియోగదారులు, జ్యువెల్లరీ యజమానుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం" అని ఏఐజేజీఎఫ్ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు అశోక్ కుమార్ వర్మ వెల్లడించారు. ముఖాలకు ముసుగుతో వచ్చే వారిని గుర్తించే పరిస్థితి లేదని, ఏదైనా దొంగతనం జరిగినప్పుడు సీసీటీవీ ఫుటేజీల సాయంతో గుర్తుపట్టేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందన్నారు. ముఖాలు కనిపించకుండా దుకాణాల్లోని ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు దేశవ్యాప్తంగా అనేకం చోటు చేసుకుంటున్నాయి. గతేడాది మార్చిలో ఇదే తరహాలో వచ్చిన కొందరు దుండగులు.. భోజ్‌పుర్‌జిల్లాలోని ఓ దుకాణంలో రూ.25కోట్ల ఆభరణాలను చోరీ చేశారు. నవంబర్‌లోనూ సివాన్ నగరంలో ఇటువంటి దోపిడీ జరిగిన విషయాన్ని స్థానిక వ్యాపారులు గుర్తుచేశారు.

# వెనెజువెలా చమురుపై ట్రంప్ కన్ను

## విక్రయించగా వచ్చిన డబ్బుపై అమెరికా అజమాయిషీ



**యూఎస్:** వెనెజువెలా చమురుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశం 30-50 మిలియన్ బ్యారెళ్ల చమురును అమెరికాకు అప్పగించనున్నట్లు ప్రకటించారు. దీనిపై వచ్చే ఆదాయం తన నియంత్రణలో ఉంటుందని ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. వెనెజువెలాపై సైనిక చర్య చేపట్టి.. దేశాధ్యక్షుడిగా ఉన్న నికోలస్ మదురోను బంధించిన కొన్ని రోజులకే ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. 'వెనెజువెలాలోని తాత్కాలిక అధికారులు అధిక నాణ్యత గల 30-50 మిలియన్ బ్యారెళ్ల చమురును యూఎస్‌కు అప్పగించనున్నారు. ఈ ప్రకటన చేయడం నాకు చాలా సంతోషంగా ఉంది. మార్కెట్ ధరకే ఈ చమురును విక్రయిస్తాం. ఆ డబ్బు నా నియంత్రణలోనే ఉంటుంది' అని రాసుకొచ్చారు. ఆ డబ్బును వెనెజువెలా, అమెరికా ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగిస్తానని తెలిపారు. ఈ చమురు అప్పగింత ప్రక్రియ వెంటనే జరగనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రణాళికను తక్షణమే అమలుచేయాలని ఇంధన కార్యదర్శి క్రిస్ రైట్‌కు తాను ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చమురు నిల్వలను నౌకల ద్వారా రవాణా చేసి.. నేరుగా అమెరికా ఓడరేవులలో దించనున్నట్లు ట్రంప్ తెలిపారు. ఇదిలాఉండగా.. వెనెజువెలాకు చెందిన చమురు కంపెనీలతో శుక్రవారం వైట్‌హౌస్ కీలక సమావేశాన్ని ఏర్పాటుచేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఓవల్ ఆఫీస్‌లో జరిగే ఈ సమావేశంలో ఎక్సాన్, చెవ్రాన్, కోనోకోఫిలిప్స్ వంటి చమురు కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నాయి.

### రిపబ్లికన్లకు ట్రంప్ వార్నింగ్..

ఇక, సొంత పార్టీ సభ్యులను ట్రంప్ బహిరంగంగా హెచ్చరించారు. 2026 మిడ్‌టర్మ్ ఎలక్షన్స్‌లో పార్టీ పనితీరు పైనే తన రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. చట్టసభ సభ్యులకు ఇచ్చిన విందులో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రతినిధుల సభలో మెజారిటీ కోల్పోతే.. తన అభిశంసనను డెమోక్రాట్లు కోరతారని వ్యాఖ్యానించారు. అందుకే మిడ్‌టర్మ్ ఎలక్షన్స్‌లో రిపబ్లికన్లు కచ్చితంగా గెలవాలన్నారు.



# కోళ్లు, మేకలవి ప్రాణాలు కావా

## వీధికుక్కల అంశంపై సుప్రీం వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** వీధి కుక్కల వివాదంపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల రక్షణపై పెద్ద మొత్తంలో పిటిషన్‌లు దాఖలు అవుతుండడంపై అసహనం వ్యక్తం చేసింది. "అందరూ కుక్కల గురించే ఆలోచిస్తుంటే..ఇతర జంతువుల జీవితాల సంగతేంటి? కోళ్లు, మేకల గురించి ఎందుకు మాట్లాడరు?వాటివి ప్రాణాలు కావా" అని ఈ కేసులో కుక్కల రక్షణపై వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ప్రశ్నించింది. కుక్కలు కరవబోతున్నాయా లేదా అనే విషయాన్ని అవి దగ్గరకు వచ్చేంతవరకు తెలుసుకోలేమని వ్యాఖ్యానించింది. ఈ సమస్యకు చికిత్స కంటే నివారణే ముఖ్యమన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. రోడ్లు, పాఠశాలల వద్ద కుక్కల వల్ల ప్రమాదాలు జరగడంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రదేశాల్లో కుక్కలు కరుస్తోన్న ఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయాలని అధికారులను ఆదేశించింది. దీనిపై న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల్లో కుక్కలకు టీకాలు వేయడం, స్టెరిలైజ్ చేయడం, షెల్టర్లు నిర్మించడం వంటి పద్ధతులతో వీధి కుక్కల సమస్య తగ్గుతోందని తెలిపారు. అయితే భారత్‌లో ఈ పద్ధతులను సరైన విధంగా పాటించకపోవడం, వీధుల్లో చెత్త విపరీతంగా పేరుకుపోవడంతో వీటి బెడద తీవ్రమవుతోందన్నారు. జంతు సంక్షమ ఎన్‌జీవోల తరఫున హాజరైన న్యాయవాది కాలిన్ గోన్సాల్వ్స్ వాదిస్తూ.. దేశంలో కుక్కకాట్ల సంఖ్యను ఉన్నదానికంటే ఐదు రెట్లు ఎక్కువగా ప్రభుత్వ నివేదికలు చూపుతున్నాయని ఆరోపించారు. కుక్క కాటు ఇంజెక్షన్‌ల సంఖ్యను కూడా సరైన విధంగా లెక్కించట్లేదన్నారు. 2021 నుంచి 19 రాష్ట్రాల్లో రేబిస్ కేసులు లేవన్నారు.

# మైనర్లతో పాక్ గూఢచర్య నెట్‌వర్క్..

## వెలుగులోకి కీలక విషయాలు


**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ కోసం గూఢచర్యం చేస్తున్న 15 ఏళ్ల బాలుడిని పఠాన్‌కోట్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు పలు కీలక విషయాలు వెల్లడించారు. భారత్‌కు చెందిన మైనర్లతో గూఢచర్యం నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేయడానికి ఐఎస్ఐ ఏజెంట్లు కుట్ర పన్నినట్లు గుర్తించామన్నారు. ఇందులోభాగంగా జమ్మూకశ్మీర్, పంజాబ్, హరియాణాకు చెందిన పలువురు మైనర్లను ట్రాప్ చేసి, ఉగ్రవాదం వైపు ఆకర్షితులయ్యేలా వారు ప్రేరేపిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు హరియాణా, పంజాబ్‌కు చెందిన 12 మంది, జమ్మూకశ్మీర్‌కు చెందిన 25 మంది మైనర్లను ఐఎస్ఐ ఏజెంట్లు ట్రాప్ చేసినట్లు గుర్తించామన్నారు. వారి కదలికలపై దర్యాప్తు బృందాలు నిఘా పెట్టినట్లు తెలిపారు. వీరంతా 14 నుంచి 17 ఏళ్లలోపు వారేనన్నారు. మొదట పాక్ హ్యాండ్లర్లు (ఘుఎఱర్ఘఱ ాజూఎ చీవ్షశీతీఎ) మైనర్ల ఫోన్‌లకు లింక్‌లు పంపిస్తున్నారని.. వాటిని క్లిక్ చేయగానే వారి ఫోన్‌లను క్లోన్ చేస్తున్నారని పేర్కొన్నారు. ముందుగానే వారి ఫోన్లు క్లోన్ చేసి ఉండడంతో బాలురు తమ ఫోన్‌లలో సేవ్ చేసిన కంటెంట్‌ను హ్యాండ్లర్లు సేకరిస్తున్నారన్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న బాలుడి ఫోన్‌ను స్కాన్ చేయగా అతడు పాక్‌కు చెందిన ఐఎస్ఐ ఆధారిత ఏజెన్సీలు, ఉగ్రవాద గ్రూపుల నిర్వాహకులతో పలుమార్లు సంప్రదింపులు జరిపినట్లు తేలిందన్నారు. వారి సూచనల ఆధారంగా అతడు సైనిక స్థావరాల వీడియోలను చిత్రీకరిస్తున్నట్లు, భద్రతా కాన్వాయ్‌ల కదలికలను లీక్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఐఎస్ఐ ఏజెంట్లతో సంప్రదింపుల కోసం అతడు ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను కూడా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి ప్రమాదకర ముఠాల చేతిలో పడకుండా పిల్లలను రక్షించాలంటే.. తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# వెండికీ హాల్‌మార్కింగ్.. యోచనలో కేంద్రం

బంగారాన్ని మించి వెండి పగ్గాలు లేకుండా పరుగులు పెడుతోంది. ఇలాంటి సమయంలో వినియోగదారులు మోసాల బారినపడకుండా దానికి కూడా హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఈ మేరకు భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) డైరెక్టర్ జనరల్ సంజయ్ గార్గ్ వెల్లడించారు. ప్రస్తుతం వెండికి బంగారంలా హాల్‌మార్కింగ్ తప్పనిసరి కాదు. "వెండికి కూడా తప్పనిసరిగా హాల్‌మార్కింగ్ ఉండాలని పరిశ్రమ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా నిబంధనలు తీసుకురావడానికి ముందు అవసరమైన వనరుల గురించి అంచనా వేస్తున్నాం" అని గార్గ్ వెల్లడించారు. ప్రస్తుతం స్వచ్ఛందంగా జరుగుతోన్న హాల్‌మార్కింగ్ వ్యవస్థలో భాగంగా వెండి వస్తువులపై హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ కనిపిస్తోంది. దానిద్వారా వినియోగదారులు చెల్లించిన నగదుకు తగిన స్వచ్ఛత ఆయా ఆభరణాలు, వస్తువుల్లో ఉందా అనేది నిర్ధరించుకునేందు వీలు కలుగుతోంది. ఈ మార్కింగ్ ఉన్న వెండి వస్తువుల సంఖ్య 2024లో 31 లక్షలుగా ఉండగా.. 2025లో 51 లక్షలకు చేరిందని గార్గ్ తెలిపారు. అయితే, వెండిని కరిగించి, చిన్నపాటి ఆభరణాలు తక్కువ విలువలో చేస్తుంటారని.. వీటికి హాల్‌మార్కింగ్ ధ్రువీకరణ పత్రాలు అందించడం కొంత సవాలేనని బీఐఎస్ అధికారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు (ఖుశ్రీశ్రీఖుతీనిఆఅస్త్రీ శీ ంఆశ్రీజవతీ).



వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్‌ను 800, 835, 925, 958, 970, 990, 999 స్వచ్ఛతా ప్రమాణాలతో ఇస్తారు.






## మూడో రోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిశాయి. భౌగోళిక ఉద్రిక్తతలు, ట్రంప్ టారిఫ్ హెచ్చరికలు ప్రతికూల ప్రభావం చూపాయి. దీనికితోడు ఎఫ్ఐఐల విక్రయాలు, త్రైమాసిక ఫలితాల సీజన్ వేళ మదుపర్లు అప్రమత్తత పాటించడమూ మరో కారణం. ఆటోమొబైల్, ఆయిల్ గ్యాస్ షేర్లు సూచీలు నష్టాలు చవిచూడగా.. కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ షేర్లు రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 84,620.40 పాయింట్ల (క్రితం ముగింపు 85,063.34) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. చివరకి 102.20 పాయింట్ల నష్టంతో 84,961.14 వద్ద ముగిసింది. నిఫ్టీ 37.95 పాయింట్ల నష్టంతో 26,140.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.87గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.38 డాలర్లు, బంగారం ఔన్సు 4,464.01 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.



## అది తేలికైన విషయం కాదు

### దేవ్‌దత్ పడిక్కల్

విజయ్ హజారే ట్రోఫీలో దేవ్‌దత్ పడిక్కల్ తన సత్తా చాటుతున్నాడు. ఇప్పటి వరకు అతడు ఆరు ఇన్నింగ్స్‌ల్లో 605 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలున్నాయి. ఈ దేశవాళీ ట్రోఫీలో అతడి ప్రదర్శన చూసి కచ్చితంగా న్యూజిలాండ్‌తో టీమ్‌ఇండియా ఆడబోయే వన్డే మ్యాచ్‌లకు ఎంపికవుతాడని అంతా అనుకున్నారు. కానీ సెలక్టర్లు అతణ్ని జట్టులోకి తీసుకోలేదు. తాను టీమ్‌ఇండియాకు ఎంపిక కాకపోవడంపై గల కారణాలపై అతడు ఓ ఆంగ్ల పత్రికతో వెల్లడించాడు. 'నేను నిరుత్సాహానికి గురయ్యానని అయితే చెప్పను. కానీ.. జట్టు ఎంపిక గురించి ఆసక్తిగా గమనించా. కానీ అదే సమయంలో చాలా మంది బ్యాటర్లు టీమ్‌ఇండియా ఎంపిక కోసం వరుసలో ఉన్నారని అర్థం చేసుకున్నా. నిజానికి వారంతా బాగా ఆడుతున్నారు. వన్డే జట్టులో చోటు దక్కించుకోవడం అంత తేలికైన విషయం కాదు' అని దేవ్‌దత్ పడిక్కల్ అన్నాడు. అలాగే టీ20 క్రికెట్ కోసం తనను తాను ఎలా మలుచుకుంది వివరించాడు. 'నేను పెద్దయ్యాక టెస్ట్ క్రికెట్ ఆడాలనే ప్రణాళికతో ముందుకు సాగాను. ప్రస్తుత టీ20 ఫార్మాట్లో నిలదొక్కుకోవడానికి సర్దుబాట్లు చేసుకోవాల్సి వచ్చింది. అది ఒక విధంగా సవాలుగా మారింది. ఈ విషయంలో నేను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరులో దినేష్ కార్తిక్, ఆండీఫ్లవర్‌కు కృతజ్ఞతలు చెబుతాను. ఆ దశలో వారు నాకు చేసిన సాయం వల్ల నేను టీ20 క్రికెట్‌లో ఎలా మెరుగ్గా రాణించాలో తెలుసుకున్నా' అని దేవదత్ పడిక్కల్ వివరించాడు. అలాగే వన్డే క్రికెట్ గురించి కూడా అతడు మాట్లాడాడు. 'టీ20 క్రికెట్‌లో దూకుడు ప్రధానమైతే, వన్డే ఫార్మాట్లో రిథమ్ ముఖ్యం. అయితే అదృష్టవశాత్తు వన్డే క్రికెట్‌లో ఆ టెక్నిక్‌ను ప్రారంభంలోనే కనుగొన్నా. అలాగే ఇన్నింగ్స్‌ను ఎలా నిర్మించాలో తెలుసుకున్నా. వన్డే రీర్‌లో ఉపయోగపడింది' అని దేవ్‌దత్ పడిక్కల్ ఆనందం వ్యక్తం చేశాడు.




## ఐసీసీ మా అభ్యర్థనను స్వీకరించింది

### బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్

భారత్, శ్రీలంక వేదికగా ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 మధ్య టీ20 వరల్డ్ కప్ 2026 జరగనుంది. ఇందులో 20 దేశాలు పాల్గొనబోతున్నాయి. అయితే బంగ్లాదేశ్ భద్రత కారణాలను సాకుగా చూపుతూ.. తాము భారత్‌లో ఆడబోమని, మరో చోటుకు తమ మ్యాచ్‌లను తరలించాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. అయితే ఐసీసీ ఇంతవరకు దీనిపై అధికారికంగా ఏవిధమైన ప్రకటన కూడా విడుదల చేయలేదు. బంగ్లాదేశ్ విన్నపాన్ని తోసిపు చ్చిందని వార్తలు కూడా వచ్చాయి. దీనిపై తాజాగా బీసీబీ స్పందించింది. తన ప్రతిపాదనలు ఐసీసీకి అందాయని చెబుతోంది. 'భద్రత కారణాల రీత్యా బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు భారత్‌కు వెళ్లబోదని ఐసీసీకి.. బీసీబీ ప్రతిపాదన చేసింది. తమ మ్యాచ్‌లను మరోచోటుకు మార్చాలని విజ్ఞప్తి చేసింది. ఈ అభ్యర్థనను ఐసీసీ అందుకుంది. బీసీబీతో కలిసి పనిచేసేందుకు ఐసీసీ సానుకూలంగా స్పందించింది' అని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ ఈ సందర్భంగా తెలిపింది. షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ తమ మ్యాచ్‌లను కోల్‌కతా, ముంబయిల్లో ఆడాల్సి ఉంది. గ్రూప్ సిలో ఆ జట్టు ఫిబ్రవరి 7న తన తొలి మ్యాచ్‌ను కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా వెస్టిండీస్‌తో ఆడాల్సి ఉంది. ఆ తర్వాత ఇంగ్లాండ్, ఇటలీ, నేపాల్‌తో తలపడాలి. వరల్డ్ కప్ ప్రారంభానికి కేవలం నెల రోజుల సమయమే ఉన్నందున ఇప్పటికిప్పుడు వేదికలను మార్చడం చాలా క్లిష్టమైన ప్రక్రియ అని క్రికెట్ పండితులు అభిప్రాయపడుతున్నారు.

# ఇదే అసలు నిజం

### రిధిమా పాఠక్



ప్రస్తుతం భారత్, బంగ్లాదేశ్ మధ్య దౌత్యపరంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌కు ప్రెజెంటర్‌గా వ్యవహరిస్తున్న భారత్‌కు చెందిన రిధిమా పాఠక్ హోస్టింగ్ ప్యానల్ నుంచి తప్పుకొన్నారు. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో కొంతకాలంగా వరుసగా హిందువులపై దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్‌కు ఎంపిక చేయడం విమర్శలకు దారితీసింది. దీంతో ఇటీవల.. బీసీసీఐ అతన్ని రిలీజ్ చేయమని మినీవేలంలో 9.20 కోట్లకు సొంతం చేసుకున్న కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఆదేశించింది. దీంతో కేకేఆర్ అతన్ని విడుదల చేసింది. దీంతో తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేస్తూ బంగ్లాదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టీ20 వరల్డ్ కప్ 2026 నేపథ్యంలో తమ జట్టు భద్రత కారణాల రీత్యా భారత్‌లో పర్యటించబోదని, తమ మ్యాచ్‌లు మరోచోట నిర్వహించాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ ఐసీసీని కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే.. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌కు ప్రెజెంటర్‌గా వ్యవహరిస్తున్న భారత్‌కు చెందిన రిధిమా పాఠక్‌ను హోస్టింగ్ ప్యానల్ నుంచి తొలగిస్తూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే వీటిని రిధిమా పాఠక్ ఖండించారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తానే స్వచ్ఛందంగా బీపీఎల్ నుంచి తప్పుకొన్నట్లు సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. 'బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ నుంచి నన్ను తొలగించారు అనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ వాటిలో నిజం లేదు. బీపీఎల్ నుంచి వైదొలగాలని నేను వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకున్నా. నాకు దేశమే ముఖ్యం. తర్వాతే ఏదైనా. నిజాయతీ, గౌరవం, అభిరుచితో కొన్ని సంవత్సరాలుగా క్రికెట్‌కు సేవ చేసే అవకాశం నాకు లభించింది. దాన్ని మాత్రం కొనసాగిస్తాను. నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు' అని ఆమె ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

## ముంబయి, ఢిల్లీ, పంజాబ్ నుంచి వస్తేనే టీమ్‌ఇండియాలో స్థానం సుస్థిరం

### రాబిన్ ఉతప్ప



ముంబయి, ఢిల్లీ, పంజాబ్ నేపథ్యం ఉన్న క్రికెటర్లకే భారత జట్టులో సుస్థిర స్థానం ఉంటుందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప తన యూట్యూబ్ ఛానల్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశాడు. న్యూజిలాండ్ జట్టు ఈనెల 11 నుంచి భారత్‌లో పర్యటించనుంది. ఈ నేపథ్యంలో 3 వన్డేలు, 5 టీ20లు ఆడనుంది. ఇటీవలే భారత వన్డే జట్టును బీసీసీఐ ప్రకటించింది. అయితే అందులో రుతురాజ్ గైక్వాడ్ స్థానం పొందలేకపోయాడు. అతడు దక్షణాఫ్రికాతో జరిగిన వన్డేలో సెంచరీ సాధించినా అవకాశం దక్కకపోవడం గమనార్హం. ఈ విషయంపై టీమ్‌ఇండియా మాజీ క్రిటర్ రాబిన్ ఉతప్ప స్పందించాడు. సెలక్టర్లు తీసుకున్న ఈ నిర్ణయం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని అతడు వాపోయాడు. 'మిత్రమా.. దీన్ని జీర్ణించుకోవడం చాలా కష్టం. అయినా హార్డ్ వర్క్‌చేయడం కొనసాగించాలి. భారత క్రికెట్‌లో ఉన్న సవాళ్లలో ఇది కూడా ఒకటి. ముఖ్యంగా ముంబయి, ఢిల్లీ, పంజాబ్ వంటి ప్రధాన క్రికెట్ కేంద్రాల నుంచి రాకపోతే.. క్రిటర్లు టీమ్‌ఇండియాలో తమ స్థానం సుస్థిరం చేసుకోవడానికి మరింత కష్టపడాల్సి ఉంటుంది' అని రాబిన్ ఉతప్ప అన్నాడు. రుతురాజ్ గైక్వాడ్ తన తొలి వన్డే మ్యాచ్ 2022లో ఆడాడు. అతడికి ఇప్పటివరకు కేవలం 9 వన్డే మ్యాచ్‌ల్లో మాత్రమే టీమ్‌ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. అతడు 28.50 యావరేజ్‌తో 228 పరుగులు చేశాడు. అందులో ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ ఉన్నాయి. రుతురాజ్ గైక్వాడ్ ఇటీవల టీమ్‌ఇండియా, దక్షణాఫ్రికాకు మధ్య జరిగిన మూడు వన్డేల సిరీస్‌ల్లో పాల్గొన్నాడు. మొదటి వన్డేలో అతడు బ్యాటింగ్‌లో (8 పరుగులు) విఫలయ్యాడు. కానీ రెండో వన్డేలో సెంచరీ (105; 83 బంతుల్లో, 12 ఫోర్లు, 1 సిక్స్‌లు) చేశాడు. అలాగే భారత జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీతో కలిసి 156 బంతుల్లోనే 195 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. విశాఖపట్నంలో జరిగిన చివరి వన్డేలో మాత్రం రుతురాజ్ గైక్వాడ్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు.

## జాకబ్ బెథెల్ భారీ సెంచరీ

### ఇంగ్లాండ్ ఆధిక్యం 119



**సిడ్నీ:** యాషెస్ సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ అయిదో టెస్ట్ మ్యాచ్‌లో తలపడుతున్నాయి. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ 75 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బ్యాటర్ జాకబ్ బెథెల్ భారీ సెంచరీతో (142; 232 బంతుల్లో, 15 ఫోర్లు) అజేయంగా నిలిచాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ 119 పరుగుల ఆధిక్యంలో ఉంది. అయితే ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌కు విజయావకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇంగ్లాండ్ గెలవాలంటే ఏదైనా అద్భుతం జరగాల్సిందే. తొలుత 518/7 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆట ప్రారంభించిన ఆస్ట్రేలియా 567 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్‌స్మిత్ సెంచరీతో (138; 220 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) సత్తా చాటాడు. వెబ్‌స్టర్ 71 (87 బంతుల్లో, 7 ఫోర్లు) పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్, జోష్ టంగ్.. తలో 3, బెన్‌స్టోక్స్ 2, విల్ జాక్స్, జాకబ్ బెథెల్ చెరో వికెట్ తీసుకున్నారు. ఫీల్డింగ్ సమయంలో ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ గజ్జల్లో గాయం కారణంగా మైదానాన్ని వీడాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ జట్టుకు ఆదిలోనే ఆసీస్ బౌలర్ మిచెల్‌స్టార్క్ షాక్ ఇచ్చాడు. అతడు జాక్ క్రాలీని (1) ఎల్‌బీడబ్ల్యూగా పెవిలియన్‌కు పంపాడు. దీంతో 4 పరుగులకే ఇంగ్లాండ్ తన తొలి వికెట్ కోల్పోయింది. తర్వాత క్రీజులోకి వచ్చిన జాకబ్ బెథెల్, బెన్ డకెట్‌తో (42; 55 బంతుల్లో 6 ఫోర్లు) కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 110 బంతుల్లో 81 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. బెన్ డకెట్ వెనుదిరిగాక క్రీజులోకి వచ్చిన జోరూట్ (6) బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. తర్వాత హ్యారీ బ్రూక్ (42; 48 బంతుల్లో, 5 ఫోర్లు) బెథెల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 115 బంతుల్లో 102 పరుగులు జత చేశాడు. హ్యారీ బ్రూక్ వెనుదిరిగాక క్రీజులోకి వచ్చిన బ్యాటర్లు ఎవరూ పెద్దగా పరుగులు చేయలేదు. బెన్‌స్టోక్స్ (1), బ్రైడన్ కార్స్ (16) త్వరత్వరగా పెవిలియన్‌కు వెళ్లారు. మ్యాథ్యూ పాట్స్ (0లి) నాటౌట్‌గా నిలిచాడు. జాకబ్ బెథెల్ ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. దీంతో ఇంగ్లాండ్ స్కోర్ 300 పరుగులు దాటింది. ఆసీస్ బౌలర్లలో వెబ్‌స్టర్ 3, స్కాట్ బోలాండ్ 2, మిచెల్ స్టార్క్, మిచెల్ నీసర్ తలో వికెట్ తీసుకున్నారు.




## ఎల్ఐసీ కొత్త ప్లాన్

### ఒకసారి కడితే జీవితాంతం ఆదాయం..

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సరికొత్త బీమా పాలసీ 'జీవన్ ఉత్సవ్'ను అందుబాటులోకి తెచ్చింది. పొదుపు, బీమా కోరుకునే వారి కోసం సింగిల్ ప్రీమియం ఆప్షన్‌తో దీన్ని లాంచ్ చేసింది. అంటే ఒకసారి ప్రీమియం చెల్లిస్తే జీవితాంతం ఆదాయం పొందొచ్చు. ఇది నాన్ పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్, సింగిల్ ప్రీమియం ప్లాన్. అంటే మార్కెట్‌తో సంబంధం ఉండదు. ఎల్ఐసీ లాభాలను పాలసీదారులకు చెల్లించదు. జనవరి 12 నుంచి కొనుగోలుకు అందుబాటులోకి వస్తుంది. దీని పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం..

- 30 రోజుల వయసున్న పిల్లల నుంచి గరిష్ఠంగా 65 ఏళ్ల వయసున్న వారు ఈ పాలసీని ఎంచుకోవడానికి అర్హులు.
- కనీస ప్రాథమిక బీమా మొత్తం రూ.5 లక్షలు. ఆపై ఎంత మొత్తం అయినా ఎంపిక చేసుకోవచ్చు. గరిష్ఠ పరిమితి లేదు.
- పాలసీ కాలపరిమితిలో ప్రతి రూ.వెయ్యికి ఏటా రూ.40 చొప్పున గ్యారంటీడ్ అడిషన్స్ కింద జమ అవుతాయి.
- ఇందులో రెండు రకాల ఆప్షన్లు ఉంటాయి. రెగ్యులర్ బెనిఫిట్ ఆప్షన్ (ఆప్షన్-1) కింద పాలసీదారులు ఎంచుకున్న వ్యవధిని బట్టి (7 నుంచి 17 ఏళ్ల తర్వాత) ఏటా ప్రాథమిక బీమా మొత్తంలో 10% ఆదాయం లభిస్తుంది. అంటే ఎంపిక సంవత్సరాన్ని బట్టి మరుసటి ఏడాది నుంచి ఆదాయం రావడం ప్రారంభం అవుతుంది. వ్యక్తుల అవసరాలను బట్టి దీన్ని ఎంచుకోవచ్చు.
- ఫ్లెక్సీ ఇన్‌కం బెనిఫిట్ ఆప్షన్ (ఆప్షన్-2) కింద పాలసీదారులు తమకు రావాల్సిన 10% ఆదాయాన్ని అప్పుడే తీసుకోకుండా ఎల్ఐసీ వద్దే దాచి పెట్టొచ్చు. ఇలా ఉంచిన మొత్తంపై సంస్థ వార్షిక వడ్డీ 5.5% (వార్షిక చక్రవడ్డీ) చెల్లిస్తుంది. పాలసీదారులు తమ అవసరానికి అనుగుణంగా ఈ మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. అప్పటివరకు జమ అయిన మొత్తంలో 75 శాతం వరకు వెనక్కి తీసుకోవచ్చు.
- పాలసీ వ్యవధిలో పాలసీదారు మరణిస్తే నామినీకి పాలసీ మొత్తంతో పాటు, అప్పటివరకూ జమైన గ్యారంటీడ్ అడిషన్స్ అందుతాయి. గడువు తీరే వరకూ జీవించి ఉంటే, మెచ్యూరిటీ ప్రయోజనం కింద ప్రాథమిక బీమా మొత్తం లేదా సింగిల్ ప్రీమియానికి 1.25 రెట్లు (ఏది ఎక్కువగా ఉంటే అది), గ్యారంటీడ్ అడిషన్స్ కలిపి చెల్లిస్తారు.
- ఎల్ఐసీ యాక్సిడెంట్ డెత్ అండ్ డిజెబిలిటీ బెన్‌ఫిట్ రైడర్, ఎల్ఐసీ న్యూటర్మ్ అష్యూరెన్స్ రైడర్ వంటివి జోడించుకోవచ్చు. ఇందుకు కొంత అదనపు ప్రీమియం చెల్లించాలి. వీటిని పొందేందుకు కొన్ని అర్హత ప్రమాణాలను నిర్దేశించారు.

## బయోకాన్ నుంచి 3 క్యాన్సర్ ఔషధాలు

క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే మూడు కొత్త బయోసిమిలర్స్‌ను తన అనుబంధ సంస్థ బయోకాన్ బయోలాజిక్స్ ఆవిష్కరించనుందని బయోకాన్ ప్రకటించింది. ట్రస్టుజుమాబ్/హైలారోనిడేస్(హెర్సెప్టిన్ ఎస్‌సీ/హెర్సెప్టిన్ హైలెక్టా), నివోలుమాబ్ (ఓప్డివో), పెమ్బ్రోలిజుమాబ్ (కీట్రుడా).. ఈ మూడు ఔషధాలను శాన్‌ఫ్రాన్సిస్కోలో వచ్చే వారం జరగబోయే '2026 జేపీ మోర్గాన్ హెల్త్‌కేర్ కాన్ఫరెన్స్'లో ప్రదర్శించనున్నట్లు ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో బయోకాన్ తెలిపింది. ఈ కొత్త మందులతో పరిశ్రమలో ఆంకాలజీ ఔషధాల్లో అత్యంత విస్తృత స్థాయి పోర్ట్‌ఫోలియో ఉన్న కంపెనీల్లో ఒకటిగా అవతరించనున్నట్లు, ఇప్పటికే 17 క్యాన్సర్ ఔషధాలు కంపెనీ చేతిలో ఉన్నట్లు బయోకాన్ బయోలాజిక్స్ సీఈఓ, ఎండీ శ్రీహాస్ తంబే పేర్కొన్నారు.

www.rajamudranews.com రాజముద్ర ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక



# ఆగని దురంధర్ దూకుడు

## ఇప్పటికే రూ.1240 కోట్లు వసూళ్లు

ధురంధర్ సినిమా బాక్సాఫీసు వద్ద దూసుకెళ్తున్నది. ఆ ఫిల్మ్ కలెక్షన్ల జోరు తగ్గడం లేదు. తాజాగా ఆ ఫిల్మ్ ఓ కొత్త రికార్డు క్రియేట్ చేసింది. అత్యధిక వసూళ్లు చేసిన హిందీ భాష చిత్రంగా ధురంధర్ ఘనత సాధించింది. ఇప్పటి వరకు హిందీ భాషలో ధురంధర్ సినిమా రూ.1240 కోట్లు ఆర్జించినట్లు ఫిల్మ్ మేకర్స్ పేర్కొన్నారు. ఆదిత్య థార్ డైరక్షన్‌లో వచ్చిన ధురంధర్ సినిమా ప్రస్తుతం సంచలనాలు నమోదు చేస్తున్నది. జియో స్టూడియోస్ ప్రకారం ఆ ఫిల్మ్ కేవలం హిందీ భాషలోనే ఇప్పటి వరకు 1240 కోట్లు ఆర్జించింది. భారత్‌లో ఇప్పటి వరకు 968 కోట్లు ఆర్జించింది. ఇక విదేశాల్లో ఆ సినిమాకు 272 కోట్లు వచ్చాయి. దురంధర్ 2 చిత్రాన్ని మాత్రం హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో రిలీజ్ చేయనున్నారు. ఆ ఫిల్మ్ ఈ ఏడాది మార్చి 19న రిలీజ్ కానున్నది. అయితే తొలి పార్ట్‌కు విపరీతమైన డిమాండ్ ఉన్న కారణంగా.. ఆ ఫిల్మ్ సీక్వెల్‌ను పలు ఇతర భారతీయ భాషల్లో రిలీజ్ చేసే ఉద్దేశంతో నిర్మాతలు ఉన్నారు. రిలీజైన తర్వాత ధురంధర్ చిత్రం హిందీ భాషలో పలు రికార్డులు నెలకొల్పింది. కేవలం 16 రోజుల్లోనే ఇండియాలో 500 కోట్లు వసూల్ చేసింది. ఇది బాలీవుడ్‌లో రికార్డు. ఇక ఆ తర్వాత అదే వేగంతో 600, 800, వెయ్యి కోట్ల క్లబ్‌కు చేరుకున్నది.



# నెటిజన్ కామెంట్..

## స్ట్రాంగ్‌గా కౌంటర్ ఇచ్చిన కామాక్షి భాస్కర్ల

టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా కెరీర్ మొదలుపెట్టి క్రమంగా ఫుల్ ఫేమ్ దక్కించుకున్న యంగ్ బ్యూటీ కామాక్ష భాస్కర్ల. ప్రస్తుతం 'డెకాయిట్ల అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ఇదిలా ఉండగా, సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో నేరుగా ముచ్చటి స్తోంది. ఈ క్రమంలో ఓ నెటిజన్ హద్దులు దాటి అసభ్యకరమైన ప్రశ్న వేయడంతో.. కామాక్షి ఏమాత్రం వెనకడుగు వేయకుండా గట్టి సమాధానం ఇచ్చింది. "నాకు ఇష్టమైన పొజిషన్ ఏంటో అడుగుతున్నారు. నిజాయితీగానే చెబుతాను. నాకు గౌరవం లభించే, ప్రశాంతంగా ఉండే, నా నిర్ణయాలపై నాకు నియంత్రణ ఉండే స్థానమే నాకు ఇష్టం. విశ్వాసం అనేది ఆధిపత్యం చూపించడం కాదు.. మన స్పష్టతను అర్థం చేసుకోవడమే" అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది.




# భర్తలకు రవితేజ విజ్ఞప్తి..

## నవ్వులు పంచుతున్న కొత్త సినిమా ట్రైలర్..

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అంటూ ఈ సంక్రాంతికి సందడి చేయడానికి రవితేజ సిద్ధమయ్యారు. ఆయన కథనాయకుడిగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందిన ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతీ కథనాయికలు. జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇద్దరి భామల మధ్య నలిగిపోతోన్న వ్యక్తిగా రవితేజ తన మార్క్ కామెడీతో అలరిస్తున్నారు.

# ఆ రెండు చిత్రాలకు హైకోర్టులో ఊరట

## టిక్కెట్లు పెంచుకునేలా ఉత్తర్వులు

'ది రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల విషయంలో గతంలో సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు 'పుష్ప2', 'ఓజీ', 'గేమ్ ఛేంజర్', 'అఖండ 2' చిత్రాలకే పరిమితం చేసింది. దీంతో తాజా చిత్రాల నిర్మాతలకు ఊరట లభించినట్లయ్యింది. టికెట్ ధరలు పెంచడానికి వీల్లేదంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరుతూ వేర్వేరుగా పిటిషన్లు వేశారు. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల కోసం హోంశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ విజ్ఞప్తిని పరిశీలించేలా హోంశాఖ కార్యదర్శికి సూచించాలని కోరారు. దీనిపై బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. గతంలో ఇచ్చిన తీర్పును ఆ చిత్రాల వరకే పరిమితం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఈ రెండు చిత్రాలకు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం లభించింది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'ది రాజాసాబ్' జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుండగా.. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న విడుదల కానుంది. హైకోర్టు ఉత్తర్వులతో 'ది రాజాసాబ్' బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి.





### ది రాజాసాబ్ టికెట్ ధరలు ఇలా..

ముందు రోజు వేసే స్పెషల్ ప్రీమియర్ టికెట్ ధరను రూ.1000 (పన్నులతో కలిపి) నిర్ణయించారు. ఇక జనవరి 9వ తేదీ నుంచి పదిరోజుల పాటు సింగిల్ స్క్రీన్‌లలో టికెట్ ధరపై రూ.150 (పన్నులతో కలిపి), మల్టీప్లెక్స్‌లలో రూ.200 (పన్నులతో కలిపి) పెంచుకునే వెసులుబాటు కల్పించింది. అలాగే, రోజుకు ఐదు షోలను ప్రదర్శించేందుకు అనుమతి ఇచ్చింది. హారర్ కామెడీ థ్రిల్లర్ నేపథ్యంగా భారీ బడ్జెట్‌తో పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ ఈ సినిమాను నిర్మించింది. ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, రిద్ధికుమార్, నిధి అగర్వాల్ నటిస్తున్నారు. సంజయ్‌దత్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందించిన పాటలు ఇప్పటికే యువతను ఆకట్టుకుంటున్నాయి.

# మా ఇంటి బంగారంతో సమంత పలకరింపు

సమంత అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దర్శకురాలు మినహా ఇప్పటివరకూ ఎవరూ ఈ సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను సామ్ షేర్ చేశారు. ఈ సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్న సమంత .. ఆసక్తికర క్యాప్షన్ పెట్టారు. 'మీరు చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది అంటూ రాశారు. జనవరి 9న ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో అభిమానులు సంబర పడుతున్నారు. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అని కామెంట్స్ చేస్తున్నారు. 'ఓ బేబీ' తర్వాత సమంత దర్శకురాలు నందిని రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. గతేడాది అక్టోబర్ 2న దీని షూటింగ్‌ను ప్రారంభించారు. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మిస్తున్న రెండో చిత్రమిది. దర్శకుడు రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరి సహ నిర్మాతలు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు సమాచారం. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు. దీనితో పాటు సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫజల్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా ఇది రూపొందుతోంది.






# దృశ్యం-3 ఏప్రిల్‌లో విడుదల

మలయాళం నుంచి క్రైం థ్రిల్లర్ జోనర్‌లో వచ్చి దక్షిణాది భాషల్లో సూపర్ క్రేజ్ సంపాదించిన ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ దృశ్యం. జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ప్రేక్షకులను కట్టిపడేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పుడీ ఫ్రాంచైజీలో అందరినీ మెస్మరైజ్ చేసేందుకు మరోసారి దృశ్యం 3 కూడా వస్తోంది. మోహన్ లాల్ , మీనా కాంబోలో వస్తోన్న దృశ్యం3 గత సెప్టెంబర్‌లో గ్రాండ్‌గా లాంచ్ అయింది. తాజా అప్‌డేట్ ప్రకారం ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. ఇక ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రకటన రానే వచ్చింది. దృశ్యం ఎంతోమందిని ప్రభావితం చేస్తూ ఇప్పటికీ క్యూరియాసిటీతో ఎదురుచూసేలా చేస్తున్న సినిమా అని అన్నాడు డైరెక్టర్ జీతూ జోసెఫ్. ఎలాంటి భారీ అంచనాలు పెట్టుకోకుండా చూసే ఫ్రాంచైజీ ఇదని.. దృశ్యం 3ఏప్రిల్ తొలివారంలో మీ ముందుకు వస్తోందని ప్రకటించాడు. మొత్తానికి మూవీ లవర్స్ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న దృశ్యం థర్డ్ పార్టు రిలీజ్‌కు సంబంధించి డైరెక్టర్ జీతూ జోసెఫ్ క్రేజీ వార్తను షేర్ చేసి మూవీ లవర్స్‌తోపాటు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. జార్జ్‌కుట్టీ ప్రపంచంలోకి మరోసారి తీసుకొస్తూ.. అంటూ మోహన్ లాల్ చాలా రోజుల క్రితం షేర్ చేసిన ఫొటో ఒకటి ఇప్పటికే నెట్టింట చక్కర్లు కొడుతోంది. దశ్యం ఫ్రాంచైజీలో వచ్చిన రెండు పార్టులు ఇప్పటికే బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఫస్ట్ పార్ట్ థియేటర్‌లో విడుదలవగా.. రెండో పార్టు ఓటీటీలో విడుదలైంది. రెండు పార్టులను తెరకెక్కించిన ఆశీర్వాద్ సినిమాస్ దశ్యం 3ని కూడా తెరకెక్కిస్తోంది. కాగా హిందీలో అజయ్ దేవ్‌గన్, శ్రియా కాంబోలో దృశ్యం 3 కూడా తెరకెక్కుతుండగా.. ఈ మూవీని 2026 అక్టోబర్ 2న రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్.

# వాలంటైన్స్ డే రోజు కపుల్ ఫ్రెండ్లీ మూవీ రిలీజ్

టాలీవుడ్ యాక్టర్ సంతోష్ శోభన్ హీరో గా నటిస్తున్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్‌బ్యానర్‌పై తెరకెక్కుతోంది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా మేకర్స్ రిలీజ్ అప్‌డేట్ అందిస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ మూవీని వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. సన్‌లైట్‌లో హీరోహీరోయిన్లు రొమాంటిక్ మూడ్‌లో ఉన్న లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి అజయ్ కుమార్ రాజు పీ కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన టీజర్ మిడిల్ క్లాస్ కష్టాల నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. టీజర్‌లో నెల్లూరు కుర్రాడైన శివ (సంతోష్ శోభన్) ఇంటీరియర్ డిజైనింగ్ చేస్తూ, సరైన ఉద్యోగం లేక చెన్నైలో కష్టాలు పడుతుంటాడు. ఖర్చుల కోసం బైక్ పూలింగ్(రాపిడో లాంటివి) చేస్తుంటాడు. ఈ క్రమంలోనే ప్రీతి (మానస వారణాసి) అతని బైక్‌లో ప్రయాణిస్తుంది. అలా అనుకోకుండా కలిసిన ఈ ఇద్దరూ ఆ తర్వాత ఎలా ప్రేమలో పడతారు..? ఆ తర్వాత ఏం జరిగింది..? అనే నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు టీజర్ చెప్పకనే చెబుతోంది.



Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com